PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 233 | విజయవాడ, బుధవారం 26 మార్చి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 26 March 2025 | Rs

పి-4 పేరుతో ప్రజలను బిచ్చగాళ్లను చేయొద్దు

అంబేద్కర్ కోనసీమ జిల్లా వాసులకు సామాజిక న్యాయం కావాలి

ప్రజా చైతన్య యాత్రలో వి.శ్రీనివాసరావు

3

కింగ్స్ విన్స్

8

గుజరాత్‌పై 11 పరుగుల తేడాతో పంజాబ్ గెలుపు

స్వయంభూవరం గ్రామానికి ఆనుకుని ఉన్న ఎన్‌టిపిసి

ఈ ఊర్లో బతకలేం..

మా గ్రామాన్ని తరలించండి

స్వయంభూవరం ప్రజల వేడుకోలు

ఎన్‌టిపిసి కాలుష్యంతో ఆరోగ్య సమస్యలు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

'కట్టుకున్న ఇంటి అప్పు తీరకముందే స్లాబ్ దెబ్బతిని వర్షాలకు కారిపోతోంది. బాగుచేసుకొనే ఆర్థిక స్థోమతలేక ఆ ఇంట్లోనే ఉంటున్నాం'. అని కళ్ల నీళ్లు ఆపుకుంటూ తన ఆవేదన తెలిపారు బొండా పార్వతి. ఆమె కుటుంబానికి 70 సెంట్ల భూమి ఖాళీగా ఉంది. కాలుష్యం వల్ల ఈ భూముల్లో ఏ పంటా పడడం లేదు. భూమిని అమ్ముదామంటే ఎవరూ కొనడం లేదు. ఎన్‌టిపిసి కాలుష్య కాటుకు ఆ కుటుంబం తీవ్రంగా నష్టపోతోంది. ఇలాంటి బాధలు, సమస్యలను పరవాడ మండలం కలపాక పంచాయతీ స్వయంభూవరంలో 170 కుటుంబాలు పన్నెండేళ్లకుపైగా అనుభవిస్తున్నాయి. ఈ ఊర్లో బతకలేమని ఇక్కడి ప్రజలు వాపోతున్నారు. ఒకప్పుడు వ్యవసాయం చేసుకొని బతికే రైతుల కుటుంబాలకు ఈ ఊరి వెనుక భాగాన సింహాద్రి నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టిపిసి) ప్లాంట్ ఏర్పాటు చేశాక కష్టాలు ప్రారంభమయ్యాయి. ఉపాధి వస్తుందంటే ఆశపడి భూములిచ్చిన కుటుంబాలకు పరిశ్రమలో ఉపాధి దక్కలేదు. దీంతో, వారంతా కూలీలుగా మారారు. కూలి పనులూ ఊర్లోలేక ఇరుగుపొరుగు గ్రామాలకు వెళ్తున్నారు. పశువులను మేపుకొని బతకుదామనుకున్నా ఎన్‌టిపిసి నుంచి వెలువడుతున్న నల్లటి ధూళితో గడ్డి కూడా పెరగడం లేదు. ఎన్‌టిపిసి కోసం స్వయంభూవరం, సోమి నాయుడుపాలెం, రావాడ, పరవాడ, తిక్కవానిపాలెం, వెన్నెలపాలెం, వాడచీపురుపల్లి, కలపాక తదితర గ్రామాల నుంచి 3,384 ఎకరాలను నాడు సేకరించారు. ఈ గ్రామాలపై ఏదోక రూపంలో ఎన్‌టిపిసి కాలుష్య ప్రభావం మిగతా 7లో

గ్రామస్థాయి వరకు విజన్

స్వర్ణాంధ్ర పర్యవేక్షణకు ప్రత్యేక విభాగం • ఏప్రిల్‌లో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ • కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వర్ణాంధ్ర -విజన్ 2047 అమలులో భాగంగా గ్రామ స్థాయి వరకు కార్యాచరణ ప్రణాళికలు (యాక్షన్ ప్లాన్)లను రూపొందిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుదు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం జరిగిన కలెక్టర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ స్థాయి వరకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. వీటి ఆధారంగా నియోజకవర్గాల ప్రణాళికలను రూపొందించాలని అన్నారు. జిల్లాల్లో విజన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కలెక్టర్, నియోజకవర్గాల్లో ఛైర్మన్‌గా ఎమ్మెల్యే వ్యవహరిస్తారని తెలిపారు. విజన్ ఆమలు కోసం రాష్ట్ర స్థాయి లో 1100మంది ఉద్యోగులతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రంగాల వారీగా జిఎస్‌డితో వివిధశాఖలను మ్యాపింగ్ చేయాలని, 2025-26కు 17శాతం జిఎస్‌డిపి వృద్ధి లక్ష్యం పెట్టుకున్నట్లు సిఎం వివరించారు. ఏడాదికి 15శాతం వృద్ధిరేటు సాధనతోనే స్వర్ణాంధ్ర -2047 సాకారమవుతుందన్నారు. అప్పటికి రాష్ట్ర తలసరి ఆదాయం రూ.55లక్షలుచేరుకోవాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. సగటు జీవితకాలం 85 ఏళ్లకు పెంచడం ,సంపూర్ణ అక్షరాస్యత సాధించడం, 60శాతం పట్టణీకరణ చేయడం, 2శాతానికి నిరుద్యోగిత తగ్గించడం, రూ.39.12లక్షల కోట్ల ఎగుమతులు సాధించడంకూడా ఇతర లక్ష్యాలని 2029 నాటికి రూ.29.29లక్షల కోట్ల జిఎస్‌డిపి అంచనా అని, 29 నాటికి తలసరి ఆదాయం రూ.5,42,985కోట్లు గా సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు.

కలెక్టర్లతో సమీక్షిస్తున్న సిఎం

16,347 పోస్టులతో మెగా డిఎస్‌సి

మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ గురించి మాట్లాడుతూఏప్రిల్ మొదటి వారంలో 16,347 పోస్టుల భర్తీకి మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఎలాంటి గందరగోళం లేకుండా డిఎస్‌సి నియామకాలు జరిగేలా చూడాలని, జూన్‌లో స్కూళ్లు తిరిగి తెరిచేలోపే నియామకాల ప్రకియ పూర్తి కావాలని అన్నారు. స్కూళ్లు ప్రారంభానికి ముందే ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అందరికీ ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున తల్లికి వందనం పథకం కింద అందించాలన్నారు. రెవెన్యూ సమస్యల సత్వరపరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, సమస్యలను క్లిష్టతరం చేసి ప్రజల ఆగ్రహానికి గురికావొద్దని కలెక్టర్లకు చంద్రబాబు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతికార్యక్రమం చివరి స్థాయి వరకు చేరాలని సిఎం పేర్కొన్నారు. కలెక్టర్ల పనితీరును క్షుణ్ణంగా సమీక్షిస్తున్నామని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి,స్వపరిపాలన అనే మూల స్థంబాలపైనే పాలన ఆధారపడి ఉంటుందన్నారు. పేదరికం పోయి ప్రజలుసంతోషంగాఉండాలంటే సంక్షేమ కార్యక్రమాల అమలు తప్పనిసరన్నారు. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలంటే తగినంత ఆదాయంరావాలన్నారు. రాష్ట్రంలో పేదల ఆకలి తీర్చడానికి 204 అన్నా క్యాంటీన్లు నెలకొల్పామని, కలెక్టర్‌లు కూడా అన్నాక్యాంటీన్లను సందర్శించాలన్నారు. జిఎస్‌టిపై సమీక్షలు చేసి బకాయిలు వసూలు చేయాలని,పన్ను ఎగవేతదారులపట్ల కఠినంగా ఉండాలని ఆదేశించారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళనచేశామని, మునిసిపల్ శాఖలో ఫిర్యాదులు రాకుండా ఉన్నప్పుడే బాగా పనిచేసినట్లు భావిస్తామన్నారు. శాంతి భద్రతల విషయంలో ఎవరూ రాజీపడొద్దని, జిల్లా ఎస్‌పిలతో కలిసి పనిచేయాలని అన్నారు. రౌడీ యిజం చేసే వారిపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు.

31లోగా ఆస్తిపన్ను బకాయి చెల్లిస్తే

వడ్డీలో 50 శాతం రాయితీ

- అడిషనల్ డైరెక్టర్ అనూరాధ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆస్తి పన్ను బకాయిలు ఈ నెల 31లోగా చెల్లించాలని, గడువులోగా ఒకేసారి ఏక మొత్తంలో చెల్లించే వారికి వడ్డీలో 50 శాతం రాయితీని కల్పిస్తున్నట్లు మున్సిపల్ శాఖ అడిషనల్ డైరెక్టర్ అనూరాధ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల్లో ఇంటిపన్ను, ఖాళీ స్థలాలపై పన్నులు సకాలంలో మొదటి అర్ధ సంవత్సరానికి జూన్, రెండో అర్ధ సంవత్సరానికి డిసెంబరు లోగా పన్ను చెల్లించని వారు 2 శాతం వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. పన్ను చెల్లింపు దారుల నుంచి వినతులు వస్తున్న నేపథ్యంలో పురపాలక సంఘాల్లో పేరుకుపోయిన పన్ను బకాయిల వసూళ్ల మెరుగుపరిచేందుకు ఆస్తి పన్ను, ఖాళీ స్థలంపై పన్నులు ఈ నెల 31లోపు ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీపై 50 శాతం రాయితీ అందిస్తున్నట్లు ఆమె తెలిపారు.

పాస్టర్ అనుమానాస్పద మృతి

- రాజానగరం సమీపంలో ప్రవీణ్ మృతదేహం
- క్రైస్తవ, దళిత సంఘాల ధర్నా

ప్రజాశక్తి- రాజానగరం (తూర్పుగోదావరి జిల్లా)

పాస్టర్ ప్రవీణ్ (ఫైల్)

హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కొంతమూరు-దివాన్ చెరువు వెళ్లే ఫోర్త్ బ్రిడ్జి పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు పక్కన విగత జీవిగా కనిపించారు. పక్కన ఆయన బుల్లెట్ వాహనం ఉంది. విజయవాడ నుంచి రాజమహేంద్రవరానికి తన బుల్లెట్‌పై వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆయన శరీరంపై గాయాలు ఉన్నాయి. హెల్మెట్ ధరించినా ముఖంపై కూడా తీవ్రమైన గాయాలు ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రవీణ్ పలు టివి ఛానళ్లలో చర్చాగోష్టిలో వాదనలు గట్టిగా విన్పించడం ద్వారా పలువురికి టార్గెట్ అయ్యారని, తరచూ ఆయనకు బెదిరింపు ఫోన్ కాల్స్ కూడా వచ్చేవని క్రైస్తవ సంఘాల నాయకులు చెప్తున్నారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో చాగల్లులో జరగనున్న క్రైస్తవ సభలకు హాజరయ్యేందుకు ప్రవీణ్ ఇక్కడకు వస్తున్నట్లు తెలిసింది. రాజమహేంద్రవరంలోని దివాన్ చెరువులోగల ఆయన విశ్రాంతి తీసుకొనే ఫ్లాట్‌కు వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారా? లేదా ఎవరైనా దాడి చేసి హత్య చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటన స్థలాన్ని రాజానగరం పోలీసులు పరిశీలించి ప్రవీణ్ భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రవీణ్ మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ రాజమండ్రి ప్రభుత్వాస్పత్రి వద్ద పలు మిగతా 7లో

సమగ్ర విచారణ జరపాలి : సిపిఎం

క్రైస్తవ బోధకులు ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ ఘటనపై ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయని పేర్కొంది. క్రైస్తవ మత ప్రచారం చేస్తున్నారనే కారణంతో కొంతమంది దుండగులు ఆయన మృతికి కారణమయ్యారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. గతంలో జరిగిన కొన్ని సంఘటనలు, తనను హత్య చేయొచ్చని ప్రవీణ్ వ్యక్తం చేసిన అనుమానాలు దీనికి బలమైన ఆధారాలని పేర్కొన్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ స్ఫూర్తితో

మదురైలో కదంతొక్కిన రెడ్‌షర్ట్ వలంటీర్స్

బ్రిగేడ్ వలంటీర్ల రిహార్సల్ పరేడ్‌తో ఎరుపెక్కిన వీధులు • సిపిఎం 24వ మహాసభ ర్యాలీకి సంసిద్ధం

7లో..



ఏడాదిలో 20 లక్షల సోలార్ యూనిట్లు : సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతి నియోజకవర్గంలో 10 వేల రూఫ్ టాప్ యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. సచివాలయంలో మంగళవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఈ అంశంపై ఆయన మాట్లాడారు. ఈ ఏడాది రాష్ట్రంలో 20 లక్షల రూఫ్ టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంపై ఎమ్మెల్యేలు, కలెక్టర్లు దృష్టి సారించాలని సూచించారు. 2 కిలో వాట్ల రూఫ్ టాప్ యూనిట్ ఏర్పాటు చేసుకునే ఎస్సి, ఎస్టి లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం రూ.60 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.55 వేలను సబ్సిడీగా అందించి నూరు శాతం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఉత్పత్తి అయిన విద్యుత్‌ను అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన దానిని గ్రిడ్‌కు అందిస్తే యూనిట్‌కు రూ.2.90 పైసలు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎస్సి, ఎస్టిలకు 200 యూనిట్లు వరకూ ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, ఈ పథకం అమలుతో వారికి మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. బిసి వర్గాలకు 2 కిలో వాట్ యూనిట్‌కు కేంద్రం రూ.60 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలు అందింస్తుండగా, మరో రూ.35 వేలు లబ్ధిదారులు బ్యాంక్ రుణంగా పొంది ఐదేళ్లలో తిగిరి చెల్లించవచ్చని తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరిలో ఈ పథకాన్ని ప్రారంభించిందని పేర్కొన్నారు.

ప్రజల్లో సంతృప్త స్థాయి పెంచేలా చర్యలు : ఐ అండ్ పిఆర్ డైరెక్టర్

ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలపై ప్రజల్లో మరింత సంతృప్తి స్థాయి పెంచేలా జిల్లాలో యంత్రాంగం పని చేయాలని ఆ దిశగా జిల్లా కలెక్టర్లు కృషి చేయాలని రాష్ట్ర సమాచార పౌర సంబందాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. సచివాలయంలో మంగళవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఆయన పీపుల్స్ పర్సెప్షన్‌పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటం, తదితర అంశాల్లో ఇంకా సంతృప్తి స్థాయి పెరగాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ గతంలో కంటే ప్రస్తుతం మెరుగైందని, అయితే అది మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టిసి సేవలు, ఇసుక లభ్యత, శాంతి భద్రతలు, క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ తదితర అంశాలపై ఐవిఆర్ఎస్ సర్వేలో సేకరించిన ప్రజా సంతృప్తి స్థాయిపైన ఆయన సిఎంకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో వివరించారు. ఇందుకు సంబంధించి వివరాలు జిల్లా కలెక్టర్లకు అందిస్తామని, ఎక్కడ వెనుకబడి ఉన్నారో మదింపు చేసుకుని మెరుగుపరచడానికి కృషి చేయాలని కోరారు.

మల్లన్న సన్నిధిలో కర్ణాటక గవర్నర్

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైల మల్లికార్జునస్వామి, భ్రమరాంబ అమ్మవార్లను కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గేహ్లోట్ మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా హైదరాబాద్ నుండి ప్రత్యేక కాన్వాయ్‌లో ఆయన శ్రీశైలం శంకర అతిథి గృహానికి చేరుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద గవర్నర్‌కు వేద పండితులు, అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం భ్రమరాంబదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఇఒ శ్రీనివాసరావు స్వామిఅమ్మ వార్ల చిత్రపటాన్ని, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

తాగునీటికి కాల్ సెంటర్లు

- కలెక్టరేట్‌లో ఏర్పాటుకు సిఎం చంద్రబాబు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వేసవిలో గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడైనా తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలిచ్చారు. సచివాలయంలో మంగళవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం పూర్తయ్యే వరకూ జిల్లాల్లో తాత్కాలిక కాల్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే రియల్ టైమ్‌లో పర్యవేక్షించి పరిష్కరించాలన్నారు. సమ్మర్ స్టోరేజి ట్యాంకులన్నింటినీ నీటితో నింపాలని సూచించారు. ప్రజలకు తాగునీరు ఇచ్చే పనులకు సంబంధించి ఎక్కడా నిధులకు కొరత లేదని, కలెక్టర్లు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. వేసవి నీటి ఎద్దడిని ఎదుర్కోవడంలో హేతుబద్ధంగా పని చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,47,188 హ్యాండ్ పంపులు ఉన్నాయని, వీటిలో 693 పని చేయడం లేదని, వాటిని యుద్ధ ప్రాతిపదికన రిపేరు చేస్తున్నామని పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ తెలిపారు.

రాష్ట్రంలోని అన్ని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశామని పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ సురేష్ కుమార్ తెలిపారు. 123 యుఎల్‌బిల్లో కేవలం 3 చోట్ల 3 రోజులకోసారి తాగునీటిని సరఫరా చేస్తున్నామని అక్కడా పరిస్థితి మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోని సమ్మర్ స్టోరేజి ట్యాంకులను నీటితో నింపుతున్నామని, ఎక్కడైనా మంచినీటి సమస్యలు తలెత్తితే అద్దె వాహనాలతో నీటిని సరఫరా చేస్తామన్నారు. 2028 నాటికి పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వనున్నట్లు చెప్పారు.

కేస్ స్టడీగా వైఎస్ వివేకా హత్య : లా అండ్ ఆర్డర్ సమీక్షలో సిఎం చంద్రబాబు

వైఎస్ వివేకానందరెడ్డి హత్య సంఘటన విచారణ పెద్ద కేస్ స్టడీ అవుతుందని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. లా అండ్ ఆర్డర్‌పై పోలీస్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివేకా హత్య విషయలో చోటుచేసుకున్న మలుపులను గుర్తు పెట్టుకోవాలని సిఎం చెప్పారు. ఫోరెన్సిక్ ఎవిడెన్స్ సేకరణ విషయంలో ఎస్ఒపి ద్వారా పక్కాగా వ్యవహరించాలన్నారు. నేరస్తుల గుర్తింపు, తక్షణం శిక్ష పడేలా చేయడంలో క్లూస్ టీమ్ కీలకపాత్ర పోషించాలని సిఎం పోలీస్ అధికారులకు సూచించారు. నేరం జరిగిన ప్రాంతాన్ని ముందుగా కాపాడి, సాక్ష్యాలు చెరిగిపోకుండా చూడాలన్నారు. పోలీస్ శాఖకు అవసరమైన జాగిలాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేరస్తులను గుర్తించే విషయంలో సాంకేతికతను ఎక్కువగా ఉపయోగించుకోవాలని, క్రైమ్ సీన్ జరిగిన ప్రాంతంలో సాక్ష్యాలను సేకరించే విషయంలో కొత్తపద్ధతులను అనుసరించాలని సిఎం సూచించారు. నేరస్తులు తెలివైన వాళ్ళని సాక్ష్యాలు దొరకకుండా అనేక మాయలు చేస్తారని, విచారణ అధికారులు మరింత చురుగ్గా తెలివిగా వ్యవహరించాలన్నారు. నేరాలు చేసి పారిపోయో వారు కొందరైతే నేరాలు చేసి పక్క వారిపై నెట్టేవారు మరి కొందరంటూ సిఎం చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. సమీక్షలో నేరాల నియంత్రణపై పోలీస్ శాఖ ప్రజంటేషన్ ఇచ్చారు. టెక్నాలజీ ద్వారా కేసుల పరిష్కారం నేరస్తులను శిక్షించడంలో అనుసరిస్తున్న విధానాలను అధికారులు సిఎంకు వివరించారు. డిజిటల్ అరెస్టులు, కొత్త తరహా మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.

చెక్ డ్యామ్‌లకు మరమ్మతులు

రాష్ట్రంలోని అన్ని చెక్ డ్యామ్‌లను ఈ వేసవిలోపు మరమ్మతు చేయాలని అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఉపాధి హామీ పథకంపై ఆయన మాట్లాడుతూ.. ఉపాధి నిధులను సక్రమంగా వినియోగించుకుని పనులు చేయాలన్నారు. అటవీశాఖ ఈ పథకాన్ని వినియోగించుకుని పచ్చదనం పెంపునకు కృషి చేయాలని సూచించారు. జిల్లాల్లో కలెక్టర్లు ఈ పథకం అమలుపై దృష్టి సారించి ప్రజలకు సాధ్యమైనంత ఎక్కువ పని దినాలు కల్పించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం సమర్థవంతంగా వినియోగించుకోవడానికి వేసవి కాలం చాలా కీలకమైందన్నారు. గ్రామాల్లో ప్రజలు పనుల కోసం వలసలు వెళ్లకుండా నిరోధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సాధ్యమైనన్ని ఎక్కువ రోజులు పని కల్పించాలని సూచించారు. ఉపాధి పథకంలో పనులు చేపట్టని పంచాయతీలుంటే వెంటనే గుర్తించి అక్కడ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2025-26 ఏడాదికి ఉపాధి పథకంలో 4 వేల కిలోమీటర్ల రహదారులు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. 1.55 లక్షల పంట కుంటలు తవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. 20 లక్షల కంపోస్ట్ పిట్స్ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. పల్లె పుష్కరణి కార్యక్రమం కింద వెయ్యి చెరువులు అభివృద్ధి చేయబోతున్నట్లు చెప్పారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఉపాధి పథకం కింద పనులు కల్పించలేమనే అపోహ కొంతమంది అధికారుల్లో ఉందని, గిరిజనులకు ఈ పథకంలో పనులు కల్పించవచ్చని తెలిపారు.

ర్యాలీగా వస్తున్న గిరిజనులు, సంఘం నేతలు

జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాల్సిందే

- శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళంలో ఐటిడిఎను ఏర్పాటు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు, జిఒ 3 అమలు, ఏజెన్సీ గ్రామాలను ఐదో షెడ్యూల్ చేర్చాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు మంగళవారం 'చలో కలెక్టరేట్' చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాల విభజన తరువాత శ్రీకాకుళంలో ఐటిడిఎను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీశారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం కనీసం తీర్మానం కూడా చేయకపోవడం గిరిజనులపై టిడిపి కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందన్నారు. జిల్లాకు చెందిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ విషయంలో ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. ఏజెన్సీ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని గిరిజనులు చాలా ఏళ్లుగా పోరాడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని, దీంతో గిరిజనుల భూములకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. వామపక్షాలు పోరాడి సాధించిన అటవీ హక్కుల చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 7న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు.

కదిలిన గిరిజనం

ఆదివాసీ గిరిజన సంఘం ఇచ్చిన 'చలో కలెక్టరేట్'కు గిరిజనులు భారీగా తరలివచ్చారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని, గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం అక్కడ నుంచి జ్యోతిరావు పూలే పార్కు వద్ద ఏర్పాటు చేసిన ధర్నా శిబిరానికి చేరుకున్నారు. గిరిజనుల పోరాటానికి సంఘీభావంగా మధ్యతరగతి, ఉద్యోగ సంఘాల నాయకులు కె.శ్రీనివాసు రూ.పది వేలు విరాళం అందించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు ధర్నా శిబిరానికి హాజరై సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ధర్నాలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, సంఘం నాయకులు సవర కృష్ణ, సవర సింహాచలం, జడ్‌పిటిసి మాజీ సభ్యులు సవర లకియ, బాతుపురం, నౌగుడ సర్పంచులు హరీష్, సవిత, ప్రజా, కార్మిక, పలు పౌర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆల్ ఈజ్ వెల్!

- ఇదీ పర్సప్షన్ సర్వే సారాంశం!
- ఫలితాల తీరుపై భిన్నాభిప్రాయాలు
- కలెక్టర్ల సదస్సులోనూ ప్రస్తావన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వివిధ పథకాలు, కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పర్సప్షన్ సర్వే లో 'అంతా బాగుంది' అన్న అభిప్రాయమే వ్యక్తమైనట్లు తెలిసింది. అన్ని విభాగాల్లోనూ ఇదే అభిప్రాయం రావడంతో దీనిపై అధికారవర్గాల్లోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించకపోవడం, క్యూఆర్‌కోడ్‌ల సాయంతో నిర్వహిస్తుండటంతో ఈ పరిస్థితి ఏర్పడుతున్నట్లు భావిస్తున్నారు. మంగళవారం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లోనూ ఈ విషయం ప్రస్తావరకు వచ్చినట్లు తెలిసింది. . మద్యం, ఇసుక, విద్యుత్ వంటి అంశాలపై సేకరించిన అభిప్రాయాల్లోనూ దాదాపు నూరుశాతం మంది సంతృప్తిని వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ సర్వే కోసం అనేక ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటుచేసిన సంగతి తెలిసింది. ఈ కోడ్‌ను స్కాన్ చేసి ప్రజలు తమ అభిప్రాయాలను తెలియచేయాల్సిఉంటుంది. దీంతో సాధారణ ప్రజల కన్నా పార్టీ కార్యకర్తలే ఎక్కువగా ఈ సర్వేలో పాల్గొంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మద్యంపై సేకరిస్తున్న అభిప్రాయాల్లో ఏకంగా 99 శాతం వరకు భేషుగ్గా ఉందని వచ్చింది. నాణ్యమైన మద్యం లభిస్తోందా అన్న ప్రశ్నకు 99 శాతం మంది నుంచి సానుకూలంగా సమాధానం రావడం, మంచి బ్రాండ్లు దొరుకుతున్నాయా అన్న దానికి కూడా 96 శాతం మంది, ఎమ్మార్పీ ధరలకే అమ్ముతున్నారా అన్నదానికి కూడా 99 శాతం వరకు సానుకూల స్పందన వచ్చినట్లు ఈ సర్వేలో పేర్కొన్నారు. ఇసుక బుకింగ్ సంతృప్తికరంగా ఉన్నట్లు 72 శాతం మందికి పైగా చెప్పడం, ఇసుక లభ్యత కూడా బాగుందని 69 శాతం వరకు చెప్పడం గమనార్హం. విద్యుత్ సంబంధిత అంశంపైనా 56 శాతం మంది వరకు విద్యుత్ అంతరాయాలు లేవని చెప్పారు.

ప్రభుత్వ భూ వివాదాలు పరిష్కరించేందుకు

జిల్లాల్లో రియల్ ఎస్టేట్ కమిటీలు

- 22(ఎ) భూముల పరిష్కారం కోసం ప్రత్యేక డ్రైవ్
- తప్పుల తడకగా భూముల రీ సర్వే
- రెవెన్యూశాఖ మంత్రి అనగాని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తున్నారని, ఇదే సమయంలో క్షేత్రస్థాయిలో ప్రభుత్వ, ఫ్రీ హోల్డ్ భూములు ఎలాంటి విభేదాలు లేకుండా చూసుకోవాలని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్.. కలెక్టర్లకు సూచించారు. సచివాలయంలో మంగళవారం ప్రారంభమైన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ.. వివాదాలుంటే పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపించే ప్రమాదముందన్నారు. ఇందుకోసం జిల్లాల్లో ప్రత్యేకించి ఒక రియల్ ఎస్టేట్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఈ కమిటీలో జిల్లా, రెవెన్యూ,, మున్సిపాలిటీ, పంచాయతీ, పట్టణాభివృద్ధి సంస్థలు, బ్యాంకర్లు అందరూ ఈ కమిటీలో సభ్యులుగా ఉండేలా చూడాలన్నారు. ఈ కమిటీ ప్రతినెలా లేక రెండు నెలలకోసారి సమావేశమై ఆయా జిల్లాల్లో ప్రభుత్వ భూములకు సంబంధించి ఉన్న వివాదాలను పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రజలు తమ భూముల సమస్యలకు సంబంధించి క్షేత్రస్థాయిలో అధికారుల వద్దకు వచ్చిన సమయాల్లో వాటిని పరిష్కరించి న్యాయం చేయాలని చేయలేని పక్షంలో ఎందుకు చేయలేక పోతున్నామో చెప్పగలిగేలా ఒక స్పీకింగ్ నోట్ ఇచ్చే పరిస్థితికి చేరుకోవాలన్నారు. తహశీల్దారు కార్యాలయాల్లో అధికారులు... ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలో అభ్యంతరం లేని భూములను పేదలకు క్రమబద్ధీకరించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోందన్నారు. 22(ఎ) భూముల వివాదాల పరిష్కారం కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. భూముల రీ సర్వే గత ప్రభుత్వ హయాంలో తప్పుల తడకగా జరిగిందని, ఆయా గ్రామాల్లో తిరిగి గ్రామ సభలతోపాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. పిజిఆర్ఎస్‌లో వచ్చే అర్జీల్లో 90 శాతం పరిష్కరించామని, వీటిని క్వాలిటీ డిస్పోజల్ చేయాలని సిఎం చెప్పారన్నారు. సిసిఎల్ఎ జయలక్ష్మి రెవెన్యూశాఖపై ప్రెజెంటేషన్ ఇస్తున్న నేపథ్యంలో ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకుంటూ ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో రెవెన్యూ సమస్యలపై అర్జీలు వస్తున్నాయన్నారు. భూముల సమస్యలపై గంటపాటు చర్చ జరగ్గా మంత్రులు అనగాని, పార్థసారధి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం భూ సర్వే పేరుతో అస్తవ్యస్త విధానంతో భూ వివాదాలు పెరిగాయన్నారు. ఇదే అంశంలో సిఎం జోక్యం చేసుకుంటూ భూ సమస్యలకు, ప్రజల అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులు తెలిసిన కలెక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, మంత్రులు, నిపుణులు కలిసి నెలరోజుల్లో పరిష్కారం కోసం నివేదికతో రావాలని సిఎం సూచించారు. గరిష్టంగా ఏడాది కాలంలో భూ వివాదాలపై అర్జీలను పరిష్కరించాలన్నారు.

భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

కొల్లూరు మాజీ ఎంపిపి, సిపిఎం సీనియర్ నాయకులు కృపానందం మృతి

ప్రజాశక్తి - కొల్లూరు (బాపట్ల జిల్లా)

కృపానందం (ఫైల్)

బాపట్ల జిల్లా కొల్లూరు మండల పరిషత్ మాజీ అధ్యక్షులు, సిపిఎం సీనియర్ నాయకులు అమర్తలూరు కృపానందం (85) అనారోగ్యంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భౌతికకాయంపై సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, కార్యవర్గ సభ్యులు టి కృష్ణమోహన్, మండల కార్యదర్శి వేములపల్లి వెంకటరామయ్య తదితరులు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. కృపానందం మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు ఆయన స్వగ్రామమైన బాపట్ల జిల్లా కొల్లూరు మండలం ఆవులవారిపాలెంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి వేములపల్లి వెంకటరామయ్య తెలిపారు.

నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన కృపానందం చిన్న వయస్సులోనే కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులై సిపిఎంలో సభ్యుడిగా చేరారు. ఎమర్జెన్సీ కాలంలో పోలీసులు అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేసినా పార్టీలోనే కొనసాగారు. తన స్వగ్రామమైన ఆవులవారిపాలెంలో అప్పటి పెత్తందారులు, భూస్వాములు... మాలంక గ్రామానికి చెందిన దళితులను నిరంతరం విడగొట్టి గొడవలు పెడుతున్న నేపథ్యంలో దళితులను ఐక్యం చేసి పెత్తందారులకు వ్యతిరేకంగా కృపానందం నిరంతరం పోరాటం కొనసాగించారు. దీంతో పెత్తందారులు ఆయనపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. మండల వ్యవస్థ ఏర్పడిన తర్వాత 1987 నుంచి 92 మధ్య కొల్లూరు మండల మొట్టమొదటి ఎంపిపిగా కృపానందం పనిచేశారు. ఆ సమయంలో మండల పరిధిలోని ఎస్సిలకు భూములు, సొసైటీలకు ఆయిల్ ఇంజన్లు ఇప్పించారు. పేదల భూముల్లో బోర్లు వేసేందుకు అనుమతులు ఇప్పించారు. పదవీకాలం తర్వాత కూడా సిపిఎం తెనాలి డివిజన్ కమిటీ సభ్యుడిగానూ, కొల్లూరు మండల కమిటీ సభ్యులుగా, చివరి వరకూ సిపిఎం సభ్యుడిగా కొనసాగారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సంతాపం

కృపానందం మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. సిపిఎం తెనాలి డివిజన్ కమిటీ సభ్యుడిగా, కొల్లూరు మండల మొదటి ఎంపిపిగా పనిచేసి ప్రజల మన్ననలు అందుకున్నారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారం, కూలి పోరాటాలు, పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొనేవారని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నటరాజ్ తదితరులు సంతాపం తెలిపారు.



బలభద్రపురం సర్పంచ్, గ్రామస్తులతో మాట్లాడుతున్న సిపిఎం బృందం

బలభద్రపురంలో సిపిఎం బృందం పర్యటన

- సమస్యలను ఏకరువు పెట్టిన గ్రామస్తులు

ప్రజాశక్తి - బిక్కవోలు(తూర్పు గోదావరి జిల్లా)

తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురంలో సిపిఎం బృందం మంగళవారం పర్యటించింది. మాజీ ఎంపి మిడియం బాబూరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పవన్, జువ్వల రాంబాబు, సూర్యనారాయణ తదితరులు ఈ బృందంలో ఉన్నారు. తొలుత గ్రామంలోని గ్రాసిమ్ ఫ్యాక్టరీని సందర్శించి ఉత్పత్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ బి.రామారావుతో పాటూ పలువురు గ్రామంలో నెలకొన్న సమస్యలను బృందం వద్ద ఏకరువు పెట్టారు. బలభద్రపురంతో పాటు పరిసర ఐదు గ్రామాల్లో సుమారు 50 వేల మంది జనాభా ఉన్నారని, ఈ ఐదు గ్రామాల్లోనూ ప్రజారోగ్యంపై సమగ్ర విచారణ జరిపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కేన్సర్‌తో గత వారంలోనే ముగ్గురు మృతి చెందారని తెలిపారు. గ్రాసిమ్ ఫ్యాక్టరీ నుంచి విడుదలవుతున్న ఫ్యాక్టరీ వ్యర్థాలు భూగర్భ జలాల్లో కలుస్తున్నాయని, తద్వారా తమ ప్రాంతంలో నీరు కలుషితమైందని వాపోయారు. గ్రాసిమ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉపాధి మేడిపండు చందంగా మారిందని తెలిపారు. కేవలం అన్‌స్కిల్డ్ ఉద్యోగాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని వివరించారు.

కాపవరంలో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీన్ని విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆ పరిశ్రమ ఏర్పాటైతే రాజమండ్రి, కాకినాడ తదితర ముఖ్యపట్టణాల నుంచి చెత్తను తమ గ్రామానికి చేర్చే ప్రమాదం ఉందని, ఇప్పటికే సమస్యలతో బాధపడుతున్న తమ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారనుందని తెలిపారు. గ్రాసిమ్ పరిశ్రమ ఏర్పాటును తాము వ్యతిరేకించినా, రుడా ద్వారా అనుమతులు తెచ్చుకున్నారని తెలిపారు. తమ గ్రామానికి గ్రాసిమ్ సంస్థ 91 శాతం నిధులు ఇవ్వాల్సి ఉన్నా, నేటికీ చెల్లించలేదని సర్పంచ్ తెలిపారు. అనంతరం వైద్యశిబిరాన్ని బృందం సందర్శించి వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంది.

ప్రభుత్వ విధానాలతో వ్యవసాయ కార్మికులకు భూమి కరువు

- అమలుకు నోచుకోని భూ సేకరణ చట్టాలు : సెమినార్‌లో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు భూమి కరువయ్యే పరిస్థితి నెలకొందని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. అసైన్డ్ భూములు విక్రయానికి అవకాశం కల్పించడం వల్ల ఆ భూములు సాగుదారులకు దూరమవుతాయన్నారు. విజన్ 2047లో భాగంగా పేదల భూములను కార్పొరేట్ల పరం చేసేందుకు చట్టాలను అనుకూలంగా మారుస్తున్నారని చెప్పారు. యాంత్రీకరణను ప్రోత్సహించి వ్యవసాయ కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్నారన్నారు. పెట్టుబడిదారులు లాభాలను కోరుకుంటారని, వారి స్వలాభం కోసం వీరు మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన గుంటూరు బాపనయ్య 47వ వర్ధంతి సందర్భంగా భూ సమస్య ప్రాధాన్యత - ప్రభుత్వ విధానాలు - పరిష్కార మార్గాలు, రాష్ట్ర ప్రభుత్వ విజన్-2047 - పేద ప్రజలపై ప్రభావం, వ్యవసాయ కార్మికుల జీవనంపై మతోన్మాద ప్రమాదం అనే అంశాలపై విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో సెమినార్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ శివనాగరాణి అధ్యక్షత వహించారు.

గతంలో ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూములు అమ్ముకునేందుకు అవకాశం ఇస్తే అవి భూస్వాములు, కార్పొరేట్ల చేతుల్లోకి వెళతాయే తప్ప వ్యవసాయంపై ఆధారపడే వారికి దక్కే అవకాశం లేదని హైకోర్టు న్యాయవాది సిహెచ్ రవి పేర్కొన్నారు. సెమినార్‌లో ఆయన 'భూ సమస్య ప్రాధాన్యత - ప్రభుత్వ విధానాలు - పరిష్కార మార్గాలు' అనే అంశంపై మాట్లాడుతూ.. గత దశాబ్దన్నర కాలంగా భూమి లేని పేదలు భూములు కొనుగోలు చేసే పరిస్థితి లేదన్నారు. అభివృద్ధి అంటే భూముల విలువ పెంచడమేనని ప్రభుత్వాలు భావిస్తున్నాయని, ఇది సరైంది కాదని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం అసైన్డ్ భూములు ఫ్రీ హోల్డ్ చేయడంపై పోరాటం చేయాలన్నారు. భూసేకరణ చట్టాల్లోని నిబంధనలను అధికారులు చాలాచోట్ల అనుసరించడం లేదని చెప్పారు. 2005 చట్టంలో పట్టా భూమికి, అసైన్డ్ భూములకు ఒకే విధంగా పరిహారం చెల్లించాలని ఉన్నా అధికారులు అమలు చేయని సంఘటనలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ కార్మికుల సమస్యలపై లక్ష్యాలను నిర్దేశించుకుని పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

సెమినార్‌లో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది సిహెచ్ రవి

ప్రభుత్వం తీసుకొచ్చిన స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్‌లో వ్యవసాయ కార్మికుల ప్రస్తావనే లేదని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు తెలిపారు. 'రాష్ట్ర ప్రభుత్వ విజన్ 2047 - పేద ప్రజలపై ప్రభావం' అనే అంశంపై ఆయన ప్రసంగిస్తూ.. వ్యవసాయ రంగాన్ని 2047 నాటికి పూర్తిగా కార్పొరేటీకరించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఎఐ టెక్నాలజీని ఉపయోగించి రోబోలతో వ్యవసాయ పనులు, డ్రోన్లతో మందుల పిచికారీ, కంప్యూటర్ సాయంతో తెగుళ్లు గుర్తించడంతోపాటు సాగును పూర్తిగా యాంత్రీకరణ చేసి వ్యవసాయ కార్మికులకు ఉపాధి లేకుండా చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. ల్యాండ్ సీలింగ్ చట్టానికి దొరక్కుండా ఆక్వా, ఉద్యాన పంటల సాగును పెంతున్నారని, క్లస్టర్ల పేరుతో ప్రభుత్వం చెప్పిన పంటలనే సాగు చేయాలని ఒత్తిడి చేస్తారని చెప్పారు. రానున్న కాలంలో సన్న, చిన్నకారు రైతులు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు.

మతం మానవాళికి ఉపసమనమే తప్ప కోర్కెలను తీర్చదని భగత్ సింగ్ చెప్పారని ఎంబివికె ట్రస్ట్ కార్యదర్శి పి మురళీకృష్ణ తెలిపారు. కోర్కెలు తీరాలంటే పోరాటం తప్పదన్నారు. దేశంలో మెజార్టీ పౌరులు హిందువులేనని, ఇతరులు రెండో పౌరులుగానే ఉండాలనేది మతతత్వ శక్తుల వాదన అని అన్నారు. పెట్టుబడిదారులకు లాభాలే ప్రధానమని, వారి స్వలాభం కోసం మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. మతోన్మాదాన్ని ఎదుర్కోవాలంటే బిజెపిని ఒంటరిని చేయాలన్నారు. ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక, సైద్ధాంతికంగా అన్ని కోణాల్లో పోరాటం చేయాలన్నారు. సాంస్కృతికంగా ప్రయత్నిస్తే భావాల్లో త్వరగా మార్పులు తీసుకురావచ్చని తెలిపారు. ఈ సెమినార్‌లో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి, ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు తదితరులు ప్రసంగించారు. ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, వివిధ జిల్లాల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సి ప్రకటించాలని రాస్తారోకో చేస్తున్న డిఎస్‌సి అభ్యర్థులు

మెగా డిఎస్‌సి ప్రకటించాలని ధర్నా

ప్రజాశక్తి-అవనిగడ్డ (కృష్ణాజిల్లా)

ప్రభుత్వం డిఎస్‌సి నోటిఫికేషన్ తక్షణమే ప్రకటించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న హెచ్చరించారు. మెగా డిఎస్‌సి ప్రకటించి టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగ అభ్యర్థులు మంగళవారం కృష్ణా జిల్లా అవనిగడ్డలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. తొలుత స్థానిక గ్రంథాలయం నుండి అవనిగడ్డ రాజీవ్ సెంటర్ వరకు భారి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేసి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి రామన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో డిఎస్‌సి అభ్యర్థుల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడినట్టు ఉందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వాన్ని నమ్మి ఓటు వేస్తే నిరుద్యోగులను నట్టేట ముంచిందని విమర్శించారు. డిఎస్‌సి అభ్యర్థుల పట్ల ప్రభుత్వం ఇదే నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. గత ఏడు సంవత్సరాలుగా ఒక డిఎస్‌సి ఇవ్వలేదని, నిరుద్యోగులు కోచింగ్ సెంటర్ల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించడానికి రాజకీయాల్లోకి వచ్చానని చెప్పుకునే పవన్ కల్యాణ్ నోరు ఎందుకు మూగబోయిందో చెప్పాలని నిలదీశారు. యువతను తప్పుదోవ పట్టించేందుకు మతోన్మాదాన్ని రెచ్చగొట్టే నీచమైన రాజకీయాలు రాష్ట్రంలో చెల్లవని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

పి-4 పేరుతో ప్రజలను బిచ్చగాళ్లను చేయొద్దు

- అంబేద్కర్ కోనసీమ జిల్లా వాసులకు సామాజిక న్యాయం కావాలి
- ప్రజా చైతన్య యాత్రలో వి.శ్రీనివాసరావు

శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న పేదలు, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు , కుట్టుపని కార్మికులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమలాపురం/పుట్టపర్తి అర్బన్

పి-4 పేరుతో ప్రజలను బిచ్చగాళ్లను చేయొద్దని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సిపిఎం ప్రజా చైతన్య యాత్ర మంగళవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్ నుంచి ప్రారంభమైంది. పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆండ్ర మాల్యాద్రితో కలిసి వి.శ్రీనివాసరావు సైకిల్ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పి-4 అంటే ప్రజల ఆస్తులు, సహజ వనరులను దోచుకొని కార్పొరేట్లకు కట్టబెట్టడమేనన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ ఏమైందని ప్రశ్నించారు. 'సూపర్ సిక్స్' పథకాలు వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సైకిల్ యాత్ర అమలాపురం బుద్ధవిహారం, వడ్డెర కాలనీ, బొంతువారిపేట, ఈదరపల్లి కాలువగట్టు, బండారులంక, నడిపూడి గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా సిపిఎం బృందం వద్ద ప్రజలు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. తాగునీరు సక్రమంగా రావడంలేదని, డ్రెయినేజీలు పూడుకుపోయి దోమలకు నిలయంగా మారాయని, తమ కాలనీలో పాఠశాల లేదని వడ్డెర కాలనీ వాసులు తెలిపారు. ఈదరపల్లి కాలవను అనుకుని ఇరువైపులా అనేక ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నామని, ఇప్పుడు వీటిని ఖాళీ చేయమంటున్నారని ఈదరపల్లి వాసులు వాపోయారు. ఉపాధి హామీ చట్టం పనుల్లో పని దినాలు తక్కువగా ఉంటున్నాయని, వేతనాలు సక్రమంగా ఇవ్వడంలేదని ఉపాధి కార్మికులు సిపిఎం బృందం దృష్టికి తీసుకొచ్చారు. చేనేత కార్మికులు పలు సమస్యలను వెల్లడించారు. చెంతనే గోదావరి ఉన్నా తాగునీరు దొరకట్లేని నడిపూడిలోని నక్కావారిపేట వాసులు తెలిపారు. స్థానిక సమస్యలపై వి.శ్రీనివాసరావు స్పందిస్తూ.. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ అధికారులను, రాజకీయ నాయకులను నిలదీయాలన్నారు. ఇళ్ల స్థలాలిచ్చి, ఇల్లు నిర్మించి ఇస్తేనే కూల్చడానికి ఒప్పుకోవాలని ఈదరపల్లి కాలువ వాసులకు సూచించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న కొబ్బరి చెట్లు ఏళ్లకు తరబడి భూస్వాముల చేతిల్లోనే ఉన్నాయని, వాటిని పేదలకు పంచితే వారు జీవనోపాధి పొందుతారని తెలిపారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం

- శ్రీసత్యసాయి కలెక్టరేట్ వద్ద మహాధర్నాలో సిపిఎం, ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రజలతో కలిసి నిలదీస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సత్యసాయి కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ముందుగా స్థానిక ప్రజలతో కలిసి ఆర్‌టిసి డిపో నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు.

మండుటెండను సైతం లెక్కజేయకుండా కలెక్టరేట్ ఎదుట బైటాయించారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన ధర్నాలో రాంభూపాల్, ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధి కార్మికులకు బకాయి బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. టిడ్కో గృహాలు, జగనన్న లేఅవుట్లలో అసంపూర్తిగా ఉన్న గృహాలను పూర్తి చేసి పేదలకు ఇవ్వాలన్నారు. రాయలసీమకు జీవనాడిగా ఉన్న హంద్రీనీవా కాలువను వెడల్పు చేయడం ద్వారానే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాలువ వెడల్పు చేస్తామని చెప్పి ఇప్పుడు లైనింగ్ పనులు చేపట్టడం సీమ ప్రజలను మోసం చేయడమేనన్నారు. కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు చేస్తే రైతులు, కూలీలతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. దళిత, గిరిజన ప్రాంతాలకు శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పేదల సమస్యలపై జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. అనంతపురం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇఎస్.వెంకటేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం, ఎపి రైతు సంఘం, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం లో అభివాదం చేస్తున్న నాయకులు

పన్నుల పెంపుదలను నిలిపేయాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

ప్రజాశక్తి-విజయవాడ

ఏప్రిల్ నుండి ఆస్తిపన్నుతో సహా పన్నుల పెరుగుదల నిలిపివేయాలని, కేపిటల్ విలువ మీద ఆస్తిపన్ను లెక్కించడానికి ఉద్దేశించిన సవరణ చట్టం 44/2020ని తక్షణమే రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. రాష్ట్ర పట్టణ పౌర సమాఖ్య, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ల అధ్వర్యంలో విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. టాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి సాంబిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర పట్టణ పౌరసమాఖ్య కన్వీనర్ సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే ఆస్తిపన్నును సమీక్షిస్తామని టిడిపి వాగ్దానం చేసిందని, నేటి వరకు పన్నుల పెంపుదలను సమీక్షించలేదని అన్నారు. ఆలస్యంగా చెల్లించే వారిపై 24 శాతం పెనాలిటీ వసూలు చేస్తున్నారని, ఇంత పెనాలిటీ ఏ ఆర్థిక సంస్థ వసూలు చేయడంలేదన్నారు. నీటి చార్జీలు ఇంటిపన్నుకు ముడి పెట్టారని వాటిని ఏటా ఏడు శాతం పెంచుతున్నారని, వాటిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆస్తిపన్నును మున్సిపాలిటీలకు ప్రధాన ఆదాయ వనరుగా పరిగణించరాదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ రూపాలలో ప్రజలు చెల్లిస్తున్న పన్నుల నుండే స్థానిక సంస్థలకు నిధులు కేటాయించాలని కోరారు. మున్సిపాలిటీలకు, స్థానిక సంస్థలకు రాష్ట్ర బడ్జెట్ నుండి 40 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పైన తెలిపిన సమస్యలపై ముఖ్యమంత్రికి, మున్సిపల్ శాఖ మంత్రికి అన్ని అసోసియేషన్లు లేఖలు రాయాలని, దీనిపై వచ్చే నెల తొమ్మిదిన ధర్నా నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో టాక్స్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎంవి. ఆంజనేయులు, కాలనీ అసోసియేషన్ల సమాఖ్య నాయకులు వెంకటేశ్వరరావు, అన్నె భాస్కరరావు, వి రామారావు, లోటస్ లాండ్ మార్క్ నుండి సిహెచ్ వెంకటేశ్వర్లు, హోటల్స్ అసోసియేషన్ నుండి రెడ్డి, నగరంలోని వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించిన తర్వాతే పనులు

- వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి- నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)

వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా డిఎల్.పురంలో సేకరించిన డి.పట్టా భూములకు, అదేవిధంగా భూసేకరణ ప్రభావిత గ్రామాల్లో సేకరించిన సాగు, డి.పట్టా భూముల్లో తోటలకు పరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిర్వాసితులు మంగళవారం ధర్నా చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ... డిఎల్.పురంలో సర్వే నంబర్ 193 నుంచి 199 వరకు 14 మంది పేదలకు ప్రభుత్వం కొన్నేళ్ల కిందట 64 ఎకరాల డి.ఫారం భూములు ఇచ్చిందని, వాటిపై వచ్చిన ఫల సాయంతో వారు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఆ భూములకు ఎటువంటి పరిహారమూ చెల్లించకుండా పనులు ఎలా చేపడుతారని ప్రశ్నించారు.

పరిహారం కోసం పేదలు కోర్టును ఆశ్రయించారని తెలిపారు. పరిహారం చెల్లించే వరకూ ఆ భూముల్లో పనులు చేపట్టరాదని డిమాండ్ చేశారు. డిఎల్.పురం గ్రామంలో సర్వే నంబర్ 85లో సాగులో ఉన్న పేదలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరారు. భూసేకరణ ప్రభావిత గ్రామాలు రాజయ్యపేట, చందనాడ, వేంపాడు రెవెన్యూ అమలాపురం పంచాయతీలోని సాగు, డి.పట్టా భూముల్లో ఉన్న చెట్లకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ చెల్లించే వరకూ ఎటువంటి పనులూ చేపట్టవద్దని, హానికరమైన బల్క్‌డ్రగ్ పార్కును ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయొద్దని, బల్క్ డ్రగ్ పార్క్ ప్రతిపాదనను విరమించుకోవాలని, బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు అదనంగా సేకరించదలచిన భూసేకరణ ప్రక్రియను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ నరసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. నిర్వాసితుల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తహశీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు ఎం.అప్పలరాజు, డిఎల్.పురం సర్పంచ్ కిల్లాడ కృష్ణ, ఎంపిటిసి మాజీ సభ్యులు గింజాల వెంకటరమణ, సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు వేగేశ్న కృష్ణంరాజు, ఏడిద రమణ, అప్పారావు, నిర్వాసితులు పాల్గొన్నారు.

ఎపిఎంను సస్పెండ్ చేయాల్సిందే

- విఒఎల అక్రమ తొలగింపులను ఆపాలి
- డిఆర్‌డిఎ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - బనగానపల్లె

పొదుపు మహిళలు, విఒఎల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న బనగానపల్లె డిఆర్‌డిఎ వెలుగు ఎపిఎం శ్రీనివాసులను సస్పెండ్ చేయాలని విఒఎల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా బనగానపల్లె డిఆర్‌డిఎ వెలుగు కార్యాలయం ఎదుట పొదుపు మహిళలు, విఒఎలు, సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విఒఎల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి మాట్లాడుతూ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న బనగానపల్లె ఎపిఎంకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు వత్తాసు పలకడం దారుణమన్నారు. గ్రామ ఐక్య సంఘాలలో ఎలాంటి తీర్మానాలు లేకుండా, గ్రామ ఐక్య సంఘాలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మండల సమాఖ్యలో తీర్మానం చేసి ఎపిఎం విఒఎలను అక్రమంగా తొలగిస్తున్నారని అన్నారు. తొలగించిన 300 మంది విఒఎలను తిరిగి వెంటనే విధుల్లోనికి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎపిఎం శ్రీనివాసులుపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోతే సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు, విఒఎల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమన్న, తిరుపతయ్య, బనగానపల్లె డివిజన్ ప్రధాన కార్యదర్శి జెవి.సుబ్బయ్య, సిఐటియు నాయకులు, విఒఎలు గౌసియా, కుమారి, మధు, సాయి, నాగలక్ష్మి, గ్రామైక్య సంఘం లీడర్లు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న విఒఎల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

కోకో గింజలను ప్రభుత్వమే కొనాలి

- ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కోకో రైతులు

ప్రజాశక్తి - కొవ్వూరు(తూర్పు గోదావరి జిల్లా)

కోకో గింజలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కొవ్వూరు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద కోకో కాయలు, గింజలు పట్టుకుని రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. కోకో గింజల కొనుగోళ్ల సమస్యలపై నెల రోజులుగా రైతులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కొనుగోలు కంపెనీలు రోజురోజుకీ ధర తగ్గించేస్తున్నాయని, నెల రోజుల క్రితం కిలో గింజలు రూ.650 ఉంటే ఇప్పుడు రూ.500కు తగ్గించేశారన్నారు. అన్‌సీజన్‌లో అయితే కేజీ రూ.200 కూడా కొనుగోలు చేయడం లేదని తెలిపారు కిలో గింజలకు రూ.900 ధర కల్పించకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ఇక్కడ ధర ఉండడం లేదని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేకుంటే కోకో రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. రైతుల వద్ద ఉన్న కోకో గింజలను వెంటనే కొనుగోలు చేయాలని, ధరల స్థిరీకరణ నిధి పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కోకో గింజలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని కోరారు. ఉద్యాన శాఖ నుంచి రావాల్సిన సబ్సిడీ బకాయిలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ రాణి సుస్మితకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు ఉప్పల కాశీ, నాయుడు లక్ష్మణరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకులు ఉండవల్లి కృష్ణారావు, జిల్లా కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు, జిల్లా నాయకులు కంకటాల బుద్ధుడు, సుభాష్ చంద్రబోస్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం. సుందర బాబు తదితరులు పాల్గొన్నారు.

భారత జిడిపి అంచనాలకు కోత

- 2025-26లో 6.5 శాతమే
- ఎస్అండ్‌పి గ్లోబల్ అంచనా

న్యూఢిల్లీ : భారత జిడిపి అంచనాలకు ఎస్అండ్‌పి గ్లోబల్ రేటింగ్స్ కోత పెట్టింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారత వృద్ధి రేటు 6.5 శాతానికే పరిమితం కావొచ్చని అంచనా వేసింది. అమెరికా టారీఫ్ విధానాలు వర్ధమాన దేశాలపై ప్రతికూల ప్రభావం చూపనుందని విశ్లేషించింది. ఈ నేపథ్యంలోనే భారత వినిమయ డిమాండ్‌ను దెబ్బతీయనుందని పేర్కొంది. "2026 మార్చి 31తో ముగియనున్న ఆర్థిక సంవత్సరంలో భారత జిడిపి 6.5 శాతానికి పరిమితం కావొచ్చు. ఇంతక్రితం ఈ అంచనా 6.7 శాతంగా ఉంది. వచ్చే వర్షాకాలం సీజన్ సాధారణంగా ఉండొచ్చు. అదే విధంగా కమోడిటీ, చమురు ధరలు సానుకూలంగా నమోదు కావొచ్చు." అని ఎస్అండ్‌పి పేర్కొంది. "ఆసియా, ఫసిఫిక్ రీజియన్‌లోని సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గించొచ్చని అంచనా. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా మరో 75-100 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ రేట్లను కోత పెట్టొచ్చు. అహార ధరలు తగ్గొచ్చు. వచ్చే 2025-26లో రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతంగా ఉండొచ్చు." అని ఎస్అండ్‌పి తెలిపింది.

ఆర్‌బిఐ ఇటీవల విధాన సమీక్షలో రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.50 శాతం నుంచి 6.25 శాతానికి కోత పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత జిడిపి 6.4 శాతానికి పరిమితం కావొచ్చని ఇటీవల నేషనల్ గణంకాల శాఖ (ఎన్ఎస్ఒ) అంచనా వేసింది. ఇది నాలుగేళ్లలోనే అత్యంత కనిష్ట స్థాయి కావడం ఆందోళనకరం. ఇంతక్రితం 2023-24లో జిడిపి 8.2 శాతం పెరిగింది. 2024-25లో 6.6 శాతం వృద్ధి ఉండొచ్చని ఆర్‌బిఐ ఇటీవల అంచనా వేసింది. వీటితో ఎస్అండ్‌పి అంచనాలు పోల్చితే ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరంలో గొప్ప ఆశజనక వృద్ధి రేటు కానరాకపోవడం ఆందోళనకరం.

ధర్నాలో కూర్చున్న కాంట్రాక్టర్లు

మా బిల్లులు చెల్లించండి

- ఉత్తరాంధ్ర కాంట్రాక్టర్ల ధర్నా

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఉత్తరాంధ్రలో ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, ఇతర రంగాల్లో కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు ఆరేళ్లగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఈ ఏడాది మార్చి నెలాఖరులోగా చెల్లించాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖపట్నం, ఉత్తరాంధ్ర కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎన్.నాగేశ్వరరావు, పి.అప్పలరాజు, కోశాధికారి ఎస్.మోహనరావు మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో కలిపి ఆర్అండ్‌బిలో రూ.1350 కోట్లు, పంచాయతీరాజ్‌లో రూ.800 కోట్లు, ఇతర రంగాల్లో సుమారు రూ.5 వేల కోట్లు బిల్లులు క్లియరెన్స్ కోసం ఉన్నాయన్నారు. పెండింగ్ బిల్లులు రూ.1800 కోట్ల నుండి రూ.2 వేల కోట్ల వరకు చెల్లింపు కాకుండా బకాయి ఉన్నట్లు తెలిపారు. తక్షణమే అన్ని బిల్లులు చెల్లించాలని కోరారు. ఆరేళ్లుగా బిల్లులు చెల్లింపు కాకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఫలితంగా నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎంలు), చెక్కులు బౌన్స్ అవుతున్నాయని తెలిపారు. కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితిలో తాము ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి నెలాఖరులోగా బిల్లులు చెల్లించకుంటే ఇకమీదట పనులకు టెండర్లు వేసేది లేదన్నారు. ఇప్పటికే చేస్తున్న పనులను కూడా నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు.

కంప చెట్లలో జింక పిల్ల

- సంరక్షిస్తున్న అటవీశాఖ అధికారులు

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లాలోని మాచర్ల పట్టణ శివారు అటవీశాఖ నగరవనం సమీపంలోని కంప చెట్లలో రోజుల వయసున్న జింకపిల్ల సోమవారం చిక్కుకుంది. దీన్ని చూసిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. అటవీశాఖ రేంజి అధికారి విజయలక్ష్మి ఆ జింక పిల్లకు చికిత్స చేయించి సంరక్షిస్తున్నారు. దీనిపై విలేకర్లతో మంగళవారం ఆమె మాట్లాడుతూ జింక పిల్ల తల్లి నుండి వేరు పడి జనావాసాల్లోకి వచ్చిందన్నారు. డాక్టర్లకు చూపించి సిలైన్ పెట్టించి సంరక్షిస్తున్నట్లు తెలిపారు. కోలుకోగానే పల్నాడు జిల్లా కోటప్పకోండ వద్ద ఉన్న జూ పార్క్‌కు అప్పగిస్తామన్నారు. ఇది రోజుల పిల్లని, ఆరోగ్యం బాగానే ఉందని చెప్పారు. ఏవైనా వన్యప్రాణులు అడవి నుండి జనవాసాల్లోకి వస్తే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఎవరైనా వాటికి హాని తలపెట్టినా, పెంచుకునేందుకు ఇళ్లల్లో ఉంచుకున్నా నేరమని, అటవీ హక్కుల చట్టాలు చాలా కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి - తిరుమల

ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఆలయం వెలుపల టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడుతో కలిసి ఇఒ జె.శ్యామలరావు మీడియాతో మాట్లాడారు. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. స్వామివారి మూల విరాట్టును వస్త్రంతో కప్పి ఆలయ శుద్ధి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరి, జెఇఒ వీరబ్రహ్మం పాల్గొన్నారు.

భార్య హత్య - ఆ తర్వాత భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి- వల్లూరు (వైఎస్ఆర్ జిల్లా)

భార్యను హత్య చేసి ఆపై భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన వైఎస్ఆర్ జిల్లా వల్లూరు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. అబ్బవరం ఎస్‌సి కాలనీకి చెందిన చెన్నకేశవులు (45) మద్యానికి బానిసై అనుమానంతో తన భార్య సుజాత (40)ను వేధించేవారు. దీంతో ఆమె వేరుగా ఉంటోంది. పెద్ద కుమారుడి వివాహానంతరం కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తిరిగి తన ఇంటికి సుజాత వచ్చారు. అయితే ఆమెతో మళ్లీ చెన్నకేశవులు గొడవపడ్డారు. ఈ క్రమంలో కొడవలితో ఆమెపై దాడి చేశారు. దీంతో సుజాత అక్కడికక్కడే మరణించారు. అనంతరం రైలు కింద పడి చెన్నకేశవులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇద్దరు మృతదేహాలను పోస్టుమార్టం నిమితం కడప రిమ్స్‌కు తరలించారు. మృతులు చిన్నకేశవులు, సుజాత దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు సంతోష్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నామని సిఐ తెలిపారు.

ద్వితీయార్థంలో అమెరికాలో మాంద్యం..!



వాషింగ్టన్: ప్రస్తుత ఏడాది ద్వితీయార్థంలో అమెరికాలో ఆర్థిక మాంద్యం ప్రభావాలు పెరగొచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. వాణిజ్య టారీఫ్‌ల ఉద్రిక్తతలు, ద్రవ్య సర్దుబాట్ల పర్యవసానాలతో ఇన్వెస్టర్లు, విధాన నిర్ణేతలు సతమతమవుతున్నారని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఈ నేపథ్యంలో యుఎస్ మార్కెట్‌లో రానున్న రోజుల్లో ఒడిదుడుకులు ఎదురవుతాయని మెజారిటీ ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. మాంద్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వ వ్యూహాత్మక ఆర్థిక జోక్యాలు అవసరమని సూచిస్తున్నారు. ఆర్థిక కార్యకలాపాలు మందగించడంతో 2025 మార్చి త్రైమాసికంలో జిడిపి వృద్ధి తగ్గొచ్చని హెచ్చరిస్తున్నారు. మార్చి త్రైమాసికంలో త్రైమాసికంలో యుఎస్ జిడిపి వృద్ధి 1.4 శాతానికి పరిమితమయ్యింది. 2024 చివరి మూడు నెలల్లోని 2.3 శాతం వృద్ధితో పోల్చితే చాలా మందగించింది. వాణిజ్య లోటు పెరగడం, వినియోగదారుల వ్యయం మందగించడం, శీతాకాల కార్యకలాపాలు ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలంగా మారాయని నిపుణులు పేర్కొంటున్నారు. దిగుమతులు పెరగడం, ఎగుమతులు స్తంభించడంతో వాణిజ్య లోటు రికార్డు స్థాయికి చేరుకుంది. ఒక్క జనవరి 2025లోనే వస్తు, సేవల వాణిజ్య లోటు 131.4 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. మందగమనం భయాలతో అమెరికా పౌరులు విచక్షణ, అచీతూచి కొనుగోళ్లు చేస్తున్నారు. చాలా కుటుంబాలు అత్యవసరం కాని కొనుగోళ్ల కంటే అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని నిపుణులు గుర్తు చేస్తున్నారు.

ఆరంభ లాభాలు ఆవిరి..

ముంబయి : వరుసగా ఏడో రోజూ భారత స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. మంగళవారం సెషన్‌లో ఉదయం భారీ లాభాల్లో సాగిన మార్కెట్లు.. తుదకు స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 78,741 పాయింట్ల గరిష్టాన్ని తాకగా.. తుదకు 33 పాయింట్ల లాభంతో 78,017 వద్ద ముగిసింది.

ఎన్ఎస్ఇ నిఫ్టీ 10 పాయింట్ల లాభంతో 23,669 వద్ద నమోదయ్యింది. డాలరుతో రూపాయి మారకం విలువ 16 పైసలు కోల్పోయి రూ.85.77గా ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ షేర్లు ఒత్తిడిని చవి చూడటం వల్ల ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి.

సామ్‌సంగ్ రూ.5,150 కోట్ల పన్ను ఎగవేత..?

- ఐటి శాఖ నోటీసులు జారీ
- జియోకు పరికరాల సరఫరాలో మాయాజాలం



న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్‌కు భారత ఆదాయపు పన్ను శాఖ భారీ షాక్ ఇచ్చింది. ఆ కంపెనీతో పాటు ఎగ్జిక్యూటివ్‌లకు 601 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.5,150 కోట్లు) పన్ను డిమాండ్ నోటీసులు జారీ చేసింది. కీలకమైన టెలికాం పరికరాల దిగుమతులపై సుంకాలను ఎగవేసిన ఆరోపణలపై పన్నులు, జరిమానా కలిపి చెల్లించాలని ఐటి శాఖ నోటీసుల్లో స్పష్టం చేసింది. గతేడాది కంపెనీ సాధించిన రూ.8,180 కోట్లు) నికర లాభాల్లో ఇది సగానికి పైగా ఉండటం విశేషం. కంపెనీ టెలికాం పరికరాలను దిగుమతి చేసుకునే క్రమంలో 2023 ఏడాది మొబైల్ టవర్‌లలో ఉపయోగించే కీలకమైన ట్రాన్స్‌మిషన్ పరికరాలపై 10-20 శాతం సుంకాలను చెల్లించలేదని ఐటి అధికారులు గుర్తించారు. ఈ పరికరాలను ముకేష్ అంబానీకి చెందిన టెలికాం దిగ్గజం రిలయన్స్ జియో కోసం దిగుమతి చేసి విక్రయించింది. సామ్‌సంగ్ భారతీయ చట్టాలను ఉల్లంఘించిందని, ఉద్దేశపూర్వకంగా క్లియరెన్స్ కోసం కస్టమ్స్ అథారిటీకి తప్పుడు పత్రాలను సమర్పించిందని అని కస్టమ్స్ కమిషనర్ సోనాల్ బజాజ్ నోటీసుల్లో తెలిపారు. లాభాలను పెంచుకోవాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వాన్ని మోసం చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ఉల్లంఘనలపై పన్ను బకాయిలు, 100 శాతం పెనాల్టీతో కలిపి సామ్‌సంగ్ 520 మిలియన్లు చెల్లించాలని కస్టమ్స్ విభాగం ఆదేశాలు జారీ చేసింది. అదే విధంగా ఏడుగురు సామ్‌సంగ్ ఇండియా ఎగ్జిక్యూటివ్‌లకు 81 మిలియన్ డాలర్ల జరిమానా కూడా విధించింది. దీంతో సామ్‌సంగ్ మొత్తంగా 601 మిలియన్ డాలర్లు చెల్లించాల్సి వస్తుంది. ఇది ఇటీవలి కాలంలో అతిపెద్ద పన్ను డిమాండ్లలో ఒకటి కావడం గమనార్హం. ఈవిషయంపై 2023 లోనే సామ్‌సంగ్‌ను భారత్ హెచ్చరించింది. 2021 నుంచే విచారణ జరుపుతోంది. కాగా.. తాము బాధ్యతాయుతంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్నామని సామ్‌సంగ్ పేర్కొంది. దేశంలోని చట్టాలకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని.. దీనిపై చట్టపరంగా ముందుకెళ్తామని పేర్కొంది.

సంపాదకీయం

జవాబుదారీతనం కావాలి

ఢిల్లీ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో కాలిన నోట్ల కట్టల ఉదంతం అవినీతిని మరోసారి చర్చనీయాంశం చేసింది. ఈ అంశం పార్లమెంట్‌నూ కుదిపేసింది. ఆయన నివాసంలో భారీ మొత్తంలో కాలిన కరెన్సీ కట్టల ఉదంతం వెలుగుచూసినప్పటి నుంచీ సుప్రీంకోర్టు చూపిన చొరవ, పారదర్శకంగా వ్యవహరిస్తూ త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవడం మంచిదే. కేంద్రంలో మోడీ నేతృత్వంలో ప్రభుత్వం వచ్చినప్పటి నుంచీ రాజ్యాంగంలోని అన్ని వ్యవస్థలనూ నీరుగార్చేందుకు, పరివార్ చెప్పుచేతల్లో పెట్టుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు బహిరంగ రహస్యమే. అందుకోసం ప్రలోభపెట్టడం, పదవీ విరమణ తరువాత కీలక పదవుల్లో నియమించడం తదితర అనేక టక్కుటమార విద్యలు ప్రదర్శించడంలో గత రికార్డులన్నింటినీ తిరగరాసింది. అందువల్లే అనేక వివాదాస్పద అంశాల్లో కేంద్ర ప్రభుత్వానికి, బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలకు అనుకూలంగా తీర్పులొచ్చాయనే విమర్శలూ ఉన్నాయి. ఈ ఉదంతంతో తనకూ, తన కుటుంబానికి ఎటువంటి సంబంధం లేదని, అప్రతిష్టపాలు చేసేందుకు చేసిన కుట్ర అని జస్టిస్ వర్మ చెబుతున్నారు. న్యాయమూర్తి లేని సమయంలో స్టోర్ రూమ్‌కు నిప్పుపెట్టి ఆయనను చిక్కుల్లో పడేసే కుట్ర అన్న దాంట్లో నిజమెంతున్నా, ఆ డబ్బు అక్కడికి ఎలా వచ్చింది? ఇందులో ఎవరెవరిది బాధ్యత అన్న అంశాలను తేల్చాలి. గతంలోనూ ఇలాంటి ఉదంతాలు బయటపడినప్పటికీ... సిజెఐ, కొలీజియం స్పందించిన తీరు పారదర్శకంగానే ఉంది. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుంచి ప్రాథమిక నివేదిక తెప్పించుకోవడంతోపాటు న్యాయపరమైన విధులన్నింటినీ నిలిపివేయాలని కొలీజియం నిర్ణయించింది. ఆయనను అలహాబాద్ హైకోర్టుకు తిప్పి పంపాలన్న ఆదేశం వివాదాస్పదమవుతోంది. అవినీతి పరులను పంపించడానికి తమ హైకోర్టు డంపింగ్ యార్డు కాదంటూ అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ (ఎహెచ్‌సిబిఎ) చేసిన వ్యాఖ్య తీవ్రమైనది. న్యాయవ్యవస్థ ప్రజా విశ్వాసాన్ని తిరిగి పొందాలంటే ప్రస్తుతం ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ వర్మ ఇచ్చిన అన్ని తీర్పులనూ సమీక్షించాలని ఎహెచ్‌సిబిఎ చేస్తున్న డిమాండ్‌నూ పరిగణనలోకి తీసుకోవాలి. సిఎఎ వ్యతిరేక నిరసనలు, మీడియా స్వేచ్ఛపై పరిమితులు, ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లు, యుపిలో బిజెపి నేత అవినీతి తదితర అంశాల్లో నిష్పాక్షికంగా, న్యాయబద్ధంగా తీర్పులివ్వకుండా రాజకీయ ప్రభావంతో ప్రభుత్వ ఎజెండాకు అనుకూలంగా జస్టిస్ వర్మ తీర్పులిచ్చారనే విమర్శలున్నాయి. అయితే, ఇదే అదనుగా కేంద్రం, గోడీ మీడియా కొలీజియం వ్యవస్థను అప్రతిష్ట పాలు చేసి, తాము అనుకున్న విధంగా నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జెఎసి) ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించే ప్రమాదముంది. ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకం నుంచి చీఫ్ జస్టిస్‌ను తప్పించి, తను అనుకున్న వారిని నియమించుకున్నట్టుగానే న్యాయ వ్యవస్థను చెప్పుచేతల్లోకి తీసుకునే దుర్మార్గమిది. మోడీ అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే ఇందుకు ప్రయత్నం జరగ్గా, దానిని కొట్టివేయడం ద్వారా సుప్రీంకోర్టు కొలీజియం వ్యవస్థను నిలబెట్టుకుంది. బిజెపి పెద్దలు, న్యాయశాఖ మంత్రులు, రాజ్యసభ ఛైర్మన్ ఇప్పటికీ పలు సందర్భాల్లో ప్రభుత్వం చెప్పుచేతల్లో ఉండేవిధంగా రూపొందించిన ఎన్‌జెఎసిని కీర్తిస్తుంటారు. తమకు నచ్చనివారిని కొలీజియం సిఫార్సు చేస్తే ఆ నియామకాలకు మోకాలడ్డుతున్న తీరును ఇప్పటికే చూస్తున్నాం. ఇక ఎన్‌జెఎసి గాని వస్తే పారదర్శకతకు పాతర వేసే ప్రమాదమే అధికం. నిష్పాక్షికంగా దర్యాప్తు జరపాలని, జస్టిస్ వర్మను అభిశంసించాలని పార్లమెంటులో ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. రాజ్యానికి సంబంధించిన ప్రధాన అంశాలనూ, పరిధులనూ నిర్ణయించే గొప్ప అధికారం రాజ్యాంగం ద్వారా సంతరించుకున్న న్యాయ వ్యవస్థ పూర్తి జవాబుదారీతనంగా, పారదర్శకంగా ఉండాల్సిందే. రాజ్యాంగ సంరక్షకుడిగా, ప్రాథమిక హక్కుల రక్షకుడిగా న్యాయ వ్యవస్థ ఉండాలన్న రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వ్యాఖ్యలు నిజమైనప్పుడే జ్యుడీషియరీపై ప్రజల్లో సడలుతున్న నమ్మకాన్ని పునరుద్ధరించడం సాధ్యమవుతుంది.

మహనీయుల మాట



ఈ మట్టిలో పుట్టిన
ప్రతి మనిషికీ
ఆహార లభ్యత
కనీస హక్కు.

- నార్మన్ బోర్లాగ్,
ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త.

వ్యాఖ్య

గ్రీన్‌ల్యాండ్‌ను చేజిక్కించుకోడానికి ట్రంప్ ఆరాటం

ఎం.వి.ఎస్. శర్మ

> ఇప్పటివరకూ చేసిన అన్వేషణలను బట్టి చూస్తే గ్రీన్‌ల్యాండ్‌లో 4.4 ట్రిలియన్ల డాలర్ల విలువైన కీలక ఖనిజాల నిక్షేపాలు ఉన్నట్టు అంచనా తేలింది. అందులో 1.76 ట్రిలియన్ల విలువైన చమురు, సహజవాయువు నిక్షేపాలు ఉన్నాయి. వాటిని వెలికి తీయకుండా నిలుపు చేశారు. గతంలో అమెరికన్ కంపెనీలైన బిపి. షెవ్రాన్, షెల్ తదితర సంస్థలకు ఖనిజాల అన్వేషణకు అనుమతులు ఇచ్చారు. కాని తర్వాత పర్యావరణ రక్షణ ప్రాధాన్యత రీత్యా వాటిని పునరుద్ధరించడం మానివేశారు. ఇప్పటికీ బ్రిటన్‌కు చెందిన నాలుగు కంపెనీల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. వాటి కాల వ్యవధి 2027తో ముగుస్తుంది. తమ ఇంధన అవసరాలను సౌర విద్యుత్తుతో తీర్చుకోడానికి గ్రీన్‌ల్యాండ్ సిద్ధపడుతోంది. ఇదే ట్రంప్ కంటగింపుకు కారణం అయింది. స్వయంగా గుత్త చమురు సంస్థల యజమాని అయిన ట్రంప్ పర్యావరణ లక్ష్యాలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాడు. కాప్ శిఖరాగ్ర సమావేశాన్ని అమెరికా పట్టించుకోలేదు. ప్రపంచంలో ఉన్న సమస్త చమురు నిల్వలనూ తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని ఆరాటపడుతున్నాడు.

గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకోవడం తథ్యం అంటూ ట్రంప్ పదే పదే ప్రకటిస్తున్నాడు. రెండోసారి అధికారం చేపట్టగానే ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపాలని, గాజాను తాము స్వాధీనం చేసుకుంటామని, పనామా జలసంధి పైన ఆధిపత్యాన్ని తామే చేపడతామని ప్రకటించాడు. ఆ యా దేశాల, ప్రజల సార్వభౌమాధికారాన్ని బేఖాతరు చేస్తూ ఇలా ఒక దేశాధినేత ప్రకటించడం అన్ని అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధం. ప్రపంచ శాంతికి, సహజీవనానికి భంగకరం. ఐనప్పటికీ వాటిని పట్టించుకోకుండా ట్రంప్ వ్యవహరించడం వెనుక కారణం ఏమిటి?

అమెరికా అన్న దేశం ఏర్పడిందే స్థానిక తెగలను నాశనం చేయడం, ఆక్రమించుకోవడం ద్వారా. బలవంతుడిదే రాజ్యం అన్న ఆటవిక న్యాయం అమలు చేయడం సామ్రాజ్యవాదుల స్వభావం. అయితే అమెరికా దానికొక ముసుగు తొడిగింది. దాని పేరే జాతీయ భద్రత. తాజాగా 2020లో జారీ చేసిన ఇంధన చట్టంలో దేశ భద్రతకు అవసరమైన కీలక ఖనిజాల జాబితాను ప్రకటించారు. అంటే ఆ కీలక ఖనిజాలు ఎక్కడున్నా, ఏ దేశంలో ఉన్నా వాటిని స్వాధీనం చేసుకోవడం అనేది జాతీయ భద్రత పేరుతో సమర్థించుకోడానికి అమెరికా తయారైంది. మనం మామూలుగానైతే మన దేశానికి వెలుపలి నుండి కాని, ఆంతరంగికంగా కాని ప్రమాదం ఎదురైనప్పుడు దానిని భద్రతా సమస్యగా పరిగణిస్తాం. కాని అమెరికా తీరే వేరు. భద్రతా అవసరాల పేరుతో అది ఎప్పుడైనా, ఏ దేశం మీదనైనా దాడి చేయవచ్చు, అక్కడ ఏ సంపదనైనా స్వాధీనం చేసుకోవచ్చు. బైటకు మాత్రం ప్రపంచంలోని ప్రజాస్వామ్యాన్నంతటినీ కాపాడే రక్షకుడిని తానే అన్నట్టు పోజు పెడుతుంది. ఆ పేరుతో కూడా కుట్రలు సాగిస్తుంది.

అమెరికన్ కార్పొరేట్ల పరిశ్రమల ఉత్పత్తులకు కావలసిన 50 రకాల ఖనిజాలను ఆ ఇంధన చట్టంలో పేర్కొన్నారు. వాటిలో కనీసం 12 ఖనిజాలు గ్రీన్‌ల్యాండ్‌లో లభిస్తాయి. రేర్ ఎర్త్స్‌గా పిలిచే ఖనిజాలు టైటానియం, లిథియం వంటివి ఆధునిక పరిశ్రమల్లో ముడి పదార్థాలుగా ఉన్నాయి. ఇవేవీ అమెరికాలో లభించవు. కాబట్టి అవి ఎక్కడ లభిస్తే ఆ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుని వాటిని కొనుగోలు చేయాలి. కాని అమెరికా రూటే వేరు. ఆ దేశాలనే తన నియంత్రణలోకి తెచ్చుకోడానికి, కుదరకపోతే ఆక్రమించుకోడానికి పూనుకుంటుంది. ఇప్పుడు గ్రీన్‌ల్యాండ్, ఉక్రెయిన్‌ల మీద అమెరికా దృష్టి సారించింది ఇందుకే.

గ్రీన్‌ల్యాండ్ భూభాగంలో 1.5 శాతం, అంటే 35,000 చదరపు కి.మీ ప్రాంతంలో ఖనిజాల తవ్వకం, అన్వేషణ సాగుతోంది. ఆర్కిటిక్ ధృవ ప్రాంతానికి అతి దగ్గర్లో ఉంది గనుక ఎక్కువ భాగం మంచుతో కప్పబడి వుంటుంది. ధృవ ప్రాంతపు మంచు కరిగిపోవడం అంటే అది పలు ప్రకృతి వైపరీత్యాలకు దారి తీస్తుంది. అందుకే చాలా పరిమితంగానే అక్కడ ఖనిజాల వెలికితీతకు అనుమతులు ఇస్తున్నారు.

గతంలో చమురు, సహజవాయువు నిక్షేపాల అన్వేషణకు అనుమతిచ్చినా, 2021 నుండి అటువంటి అనుమతులను నిలుపుచేశారు. భూతల ఉష్ణోగ్రతలు పెరిగిపోయే ప్రమాదం ఉన్నందువల్ల ఆ విధంగా నిర్ణయించారు. ఇప్పటివరకూ చేసిన అన్వేషణలను బట్టి చూస్తే గ్రీన్‌ల్యాండ్‌లో 4.4 ట్రిలియన్ల డాలర్ల విలువైన కీలక ఖనిజాల నిక్షేపాలు ఉన్నట్టు అంచనా తేలింది. అందులో 1.76 ట్రిలియన్ల విలువైన చమురు, సహజవాయువు నిక్షేపాలు ఉన్నాయి. వాటిని వెలికి తీయకుండా నిలుపు చేశారు. గతంలో అమెరికన్ కంపెనీలైన బిపి. షెవ్రాన్, షెల్ తదితర సంస్థలకు ఖనిజాల అన్వేషణకు అనుమతులు ఇచ్చారు. కాని తర్వాత పర్యావరణ రక్షణ ప్రాధాన్యత రీత్యా వాటిని పునరుద్ధరించడం మానివేశారు. ఇప్పటికీ బ్రిటన్‌కు చెందిన నాలుగు కంపెనీల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. వాటి కాల వ్యవధి 2027తో ముగుస్తుంది. తమ ఇంధన అవసరాలను సౌర విద్యుత్తుతో తీర్చుకోడానికి గ్రీన్‌ల్యాండ్ సిద్ధపడుతోంది. ఇదే ట్రంప్ కంటగింపుకు కారణం అయింది. స్వయంగా గుత్త చమురు సంస్థల యజమాని అయిన ట్రంప్ పర్యావరణ లక్ష్యాలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాడు. కాప్ శిఖరాగ్ర సమావేశాన్ని అమెరికా పట్టించుకోలేదు. ప్రపంచంలో ఉన్న సమస్త చమురు నిల్వలనూ తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని ఆరాటపడుతున్నాడు.

వాస్తవానికి 1955లో అమెరికా గ్రీన్‌ల్యాండ్‌ను 100 మిలియన్ డాలర్లకు కొనేయడానికి బేరం పెట్టింది. ప్రస్తుత విలువ ప్రకారం అది 1.3 బిలియన్ డాలర్లు. అంటే గ్రీన్‌ల్యాండ్ మీద అమెరికన్ గుత్తాధిపతుల కన్ను అప్పటి నుంచీ పడిందన్నమాట.

ఇక ఉక్రెయిన్ మీద అమెరికా ప్రేమకు కారణం అక్కడ అమెరికాకు కావలసిన 'కీలక ఖనిజాలు' చాలా పుష్కలంగా ఉండడమే. టైటానియం, యురేనియం, ఇల్మెనైట్ వంటి విలువైన, అరుదైన ఖనిజాల నిల్వలు ఉక్రెయిన్ భూభాగంలో ఉన్నాయి. వీటి విలువ 14.8 ట్రిలియన్ల డాలర్లు ఉంటుందని అంచనా. ఎలక్ట్రిక్ కార్ల బ్యాటరీల తయారీకి ఉపయోగించే గ్రాఫైట్ నిల్వలు అక్కడ 19 మిలియన్ టన్నులు ఉన్నాయి. 1990 వరకూ ఉక్రెయిన్ రష్యాలో అంతర్భాగంగా ఉండేది కనుక ఆ నిక్షేపాల జోలికి పోవడం సాధ్యం కాలేదు. ఆ తర్వాత రష్యాతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకోడానికి పూనుకున్న ప్రభుత్వాన్ని కూలదోసి జెలెన్‌స్కీని అమెరికా, బ్రిటన్ ముందుకు తెచ్చి నిలబెట్టాయి. సామ్రాజ్యవాద దేశాలకు ఉక్రెయిన్‌లో ఉన్న కీలక ఖనిజసంపద తమను దాటి బైటకు పోనివ్వరాదన్న దుగ్ధ ఉంది. అందుకే రష్యాతో ఘర్షణను ఎగదోశాయి. వీళ్ళు ఈ తగువుల్ని రేగ్గొట్టుతూ వుంటే ఇంకోపక్క చైనా చల్లగా ప్రపంచంలోని రేర్ ఎర్త్స్ ఖనిజాల నిల్వలలో 75 శాతంపై తన పట్టు సంపాదించింది. అమెరికా ఆక్రోశం పెరిగిపోడానికి ఇది మరో కారణం. ఉక్రెయిన్-రష్యా యుద్ధం మరికొంత కాలం కొనసాగితే తాము చైనా కన్నా మరింత వెనుకబడి పోతామన్న భయం పట్టుకుంది. అందుకే యుద్ధాన్ని వెంటనే ఆపుచేయాలని జెలెన్‌స్కీని ట్రంప్ ఆదేశించాడు. యుద్ధాన్ని రెచ్చగొట్టడమైతే చేయగలిగారు కాని విరమింపజేయాలంటే అదంత తేలికైన వ్యవహారం కాదు కదా.

ఎలాగో ఒకలా ఈ యుద్ధాన్ని త్వరగా ముగించి, ఆ తర్వాత ఉక్రెయిన్‌లోని ఖనిజ సంపదను చేజిక్కించుకోవాలని అమెరికా తొందరపడుతోంది. మరోపక్క బ్రిటన్, జర్మనీ తదితర దేశాలు తమ పొరుగునే ఉన్న ఉక్రెయిన్ నుండి ప్రయోజనాలు వస్తే గిస్తే తమకే ముందు దక్కాలన్న తాపత్రయంలో ఉన్నాయి. ఇంకో పక్క గ్రీన్ ల్యాండ్ జోలికి అమెరికా గనుక వస్తే "అది నాటో కూటమిలో సభ్యులైన దేశాల నడుమ యుద్ధానికి దారి తీస్తుంది" అంటూ డెన్మార్క్ పార్లమెంటు ప్రతినిధి ప్రకటించారు. అంటే యూరోపియన్ సామ్రాజ్యవాద, సంపన్న దేశాలు అమెరికా ఏకపక్ష వైఖరికి తలొగ్గడానికి సిద్ధంగా లేవని కనపడుతోంది.

ఈ మొత్తం వ్యవహారంలో అమెరికా గనుక పైచేయి సాధిస్తే అది మొత్తం మానవాళి మనుగడనే ప్రమాదంలో పడవేస్తుంది. పర్యావరణానికి దిద్దుకోలేనంత హాని జరుగుతుంది. ఒకవేళ యూరప్ లోని అమెరికా మిత్రులు అమెరికా యత్నాలను అడ్డుకుంటే అది సామ్రాజ్యవాద దేశాల నడుమ ఘర్షణలను తీవ్రతరం చేస్తుంది. మొత్తం మీద ఈ వ్యవహారాన్ని ప్రపంచం యావత్తూ శ్రద్ధగా పరిశీలిస్తోంది.

కవిత్వం

నిజమైన టెర్రరిస్టు!

ఇప్పుడు మారిన గవర్నమెంట్‌లా
ఇక్కడ రాజకీయాలూ మారాయి
ఇల్లీగల్ ఇమిగ్రెంట్ల అవమానం ఒక ఎత్తు
విద్యార్థులపై నిందలు మరో ఎత్తు
ఉన్న డబ్బు మార్చి
లక్షల లోను పెట్టి వచ్చాను
మంచి భవిష్యత్తు కోసం
మంచి విద్య కోసం వచ్చిన
నేనిప్పుడు టెర్రరిస్టునే
న్యాయం కోసం నిలబడినందుకు
నేనిప్పుడు టెర్రరిస్టునే
పాలస్తీనా పక్క నిలబడినందుకు
నేనిప్పుడు టెర్రరిస్టునే
టెర్రరిస్టు దౌర్జన్యం ఎందుకని
ప్రశ్నించినందుకు
నేనిప్పుడు టెర్రరిస్టునే
నువ్వు బాంబులు వేసి సజీవ దహనం చేస్తే
ప్రశ్నించినందుకు
నేనిప్పుడు టెర్రరిస్టునే
ఆహుతైన పాలస్తీనా అమాయక
పిల్లల మహిళలు కోసం మాట్లాడినందుకు
నేనిప్పుడు టెర్రరిస్టునే
అధికారం నాపై చర్య తీసుకుంటుంది
చదువు కోసం దేశాన్ని
అమ్మని, అప్పుల్ని విడిచాను
నేనిప్పుడు టెర్రరిస్టునే దేశద్రోహినే
నువ్వు నాకు వేసిన శిక్షకు
ఇక్కడ ఒంటరి పక్షిల
రెక్కలు తెగి కొట్టుకుంటున్నా
జీవితం గమ్యంలో
ఎటు పోవాలో
ఏమి చేయాలో తెలియని
ఒంటరి జీవిని
నా పయనం శూన్యంలోకే
ఇప్పుడు టెర్రరిస్టు
ఎవరో చెప్పాల్సిందే?

- సర్వమంగళ,
కోల్‌కతా, సెల్ : 8961636848

జనవాక్యం

దర్శనాల పేర దోపిడీ!

1980 దశకంలో నేను తిరుమలకు తరచూ వెళ్ళేవాడిని. గుడి వెనుక టిటిడి ఈవో కార్యాలయం ఉండేది. అక్కడకు వెళ్ళేవాడిని. పొద్దున్నే గుడి గేటు ముందు విజయా బ్యాంక్‌లో ఐదు రూపాయలిచ్చి ఒక లడ్డు కొనుక్కొనేవాడిని. గుడిలోకి అప్పుడపుడు వెళ్ళేవాడిని. ఎపుడూ దణ్ణం పెట్టలేదు. ఊరికే లోపల చూద్దామని వెళ్ళేవాడిని. అరగంటలో లేక గంటలో తిరిగి వచ్చేవాడిని. ఉచిత దర్శనాలే. ఈరోజు ప్రత్యేక దర్శనాల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారు. అసలు దేవుణ్ణి చూడ్డానికి డబ్బులేంటి? ఈ దర్శనాల కోసం ఇతర రాష్ట్రాల మంత్రులూ, ప్రజాప్రతినిధులు కూడా పోటీ పడుతున్నారు. విఐపి దర్శనాల పేరుతో ఆలస్యం జరిగి సామాన్యుడు రోజులకొద్దీ క్యూలలో గడపాల్సి వస్తుంది. ప్రజల గుడ్డి నమ్మకాలను ఆ యా దేవస్థానాలు సొమ్ము చేసుకుంటున్నాయి. 24 గంటలలో దేవుని స్నానానికి, అన్నానికి, ఇతర పనులకు కొంత సమయం కేటాయించి, ఆ సమయాలలో దర్శనం ఆపేసి, మరల రాత్రి నిద్ర పోయే సమయం కూడా దర్శనం ఆపేసి, మిగిలిన సమయం మొత్తం ఉచిత దర్శనాలకు కేటాయించాలి. విఐపి లకు ఒక దర్శనం, లోకల్ వారికి ఒకరోజు, ఇంకా ప్రత్యేక దర్శనాలు ఎమిటి? దేవుని దృష్టిలో అందరూ సమానం అయినపుడు, ఈ రేట్లు, ఈ దర్శనాలు ఎందుకూ? గుళ్లు వ్యాపార కేంద్రాలా? సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, ఫైవ్ స్టార్ హోటళ్ల మాదిరి, రకరకాల దర్శనాల పేరుతో ఈ దోపిడీ ఏమిటి? తక్షణం దోపిడీ దర్శనాలు ఆపి, మొత్తం ఒకే దర్శనం. అదే ఉచిత దర్శనం ఏర్పాటు చెయ్యాలి. అందరూ ఒకే క్యూలో వెళ్ళాలి. రకరకాల దర్శనాలు లేకపోతే, ఒకే క్యూ అయితే అందరూ సమానంగా వెళ్తారు. కొత్త టిటిడి చైర్మన్ ఈ రకంగా, రకరకాల దర్శనాలు రద్దు చేసి అందరూ సమానమేనని నిరూపించాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

విశ్లేషణ

విశ్వవిద్యాలయాల్లో కుల, మత వివక్ష అభివృద్ధికి ఆటంకం

కత్తి పద్మారావు

> భారత్‌ను విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దడం ముఖ్యం. ఈ లక్ష్య సాధనలో ఎస్.పి.యు లదే ప్రధాన పాత్ర. కానీ ఎస్.పి.యు లలో 40 శాతం అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని నీతి ఆయోగ్ విధాన పత్రం వెల్లడించింది. ప్రతి 15 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు అవసరం కాగా వీటిలో ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉన్నారు. 60 శాతానికి పైగా ఎస్.పి.యు లకు తగినన్ని హాస్టల్ వసతులు లేవు. దాంతో గ్రామాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ఎస్.పి.యు లలో చేరి చదువుకోలేకపోతున్నారు. నిజానికి భారతదేశంలో విశ్వవిద్యాలయాలన్నింటిలో కులతత్వం, మతతత్వాన్ని మనం నిర్మూలించగలిగితే విద్య సామాన్యులకు కూడా అందే అవకాశం ఉంటుంది.

ఉన్నత విద్యా వ్యవస్థ సామాజిక, సాంస్కృతిక, సాంకేతిక, వైజ్ఞానిక వ్యవస్థలన్నింటిని ప్రభావితం చేస్తూ వెళుతుంది. ఉన్నత విద్య అనేది మానవ జీవన వికాసానికి చైతన్యాన్ని కల్పిస్తుంది. నూతన జీవన వ్యవస్థల్ని ప్రభావితం చేస్తుంది. మానవాభ్యుదయం అంతా కూడా ఉన్నత విద్య మీదే ఆధారపడి ఉంటుంది. ఉన్నత విద్య మీద జి.డి.పి వృద్ధి కూడా ఆధారపడి వున్నది.

భారతదేశంలో ఉన్నత విద్యా వ్యవస్థలో అత్యున్నతమైన పరిణామాలు జరుగుతున్నాయి. భారతదేశం విశ్వ విద్యాలయాలకు క్రీ.పూ 6వ శతాబ్దం నుండే పెట్టింది పేరు. ప్రపంచ దేశాల వారంతా ఇక్కడికి వచ్చి అధ్యయనం చేసి వెళుండేవారు. ముఖ్యంగా నలంద విశ్వవిద్యాలయం, నాగార్జునుడు స్థాపించిన విద్యాలయాలకు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల నుంచి ఎంతో మంది ఓడల మీద, ఒంటెల మీద, గుర్రాల మీద వచ్చి చదువుకున్నారు.

ఈ రోజు శాస్త్రవిజ్ఞానం అనేది ప్రపంచాన్ని నడిపిస్తున్నది. నిజానికి శాస్త్రవిజ్ఞానం వల్ల కలిగే ప్రయోజనం విస్తృతమైనది. ప్రపంచ విజేతలను వారి వ్యక్తిత్వాన్ని మనం తెలుసుకొనే క్రమంలో మనోవిజ్ఞాన శాస్త్రం గురించి కూడా మనం అవగాహన చేసుకోవలసి వుంటుంది. ప్రతి మనిషిలోను ప్రజ్ఞ, స్మృతి, ప్రేరణ, అభ్యసనం, ఉద్వేగం ఉంటాయి. అయితే ఏ ఇద్దరూ వీటిని ఒకే రకంగా అర్థం చేసుకోలేరు. అయితే మనిషి ప్రవర్తనకు కూడా ఒక శాస్త్రం వుంది. నిజానికి ప్రకృతికి, విశ్వానికి వున్న హేతుబద్ధతే మనిషిలో కూడా వుంది. ప్రకృతిలో వస్తున్న తుఫానులు, వరదల్లాగే ఆలోచనల్లో కూడా తీవ్రతలు వస్తాయి. అయితే ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది సామాన్యులుగా జీవిస్తుండగా అసామాన్యులుగా జీవిస్తున్నవారు వందల్లోనే వుంటున్నారు. వారు ప్రపంచాన్ని నడిపించగలుగుతున్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్క శాస్త్రంలో నిష్ణాతులవుతున్నారు. ప్రపంచానికి వెలుగులు పంచుతున్నారు. మనోవిజ్ఞాన శాస్త్రాన్ని కూడా కొందరు తత్వవేత్తలు ఎంతో అభివృద్ధి చేశారు.

విద్య సామాజిక పరిణామాలకు మూలం. విద్య నూతన సమాజాన్ని సృష్టిస్తుంది. విద్య వ్యక్తిత్వ నైపుణ్యాన్ని తీర్చిదిద్దుతుంది. విద్య మహోజ్వల జీవన మార్గం. ప్రపంచ దేశాలలో అన్ని దేశాలు విద్యకు ప్రాధాన్యం ఇవ్వడానికి కారణం ప్రపంచం దగ్గరవుతున్నకొద్దీ విద్యకు, భాషకు, మానవ సంబంధాల అనుబంధానికి ప్రాధాన్యం పెరగటమే. ఒక్క భారతదేశంలో వున్నారుగానీ...అనేక దేశాల్లో ఇప్పుడు నిరక్షరాస్యులు లేరు. అక్షరం అనేది ఆహారంతో, ఆహార్యంతో, నివాసంతో సమానంగా అభ్యసించబడుతుంది. అందుకనే భర్తృహరి విద్య గురించి ఇలా అన్నారు. 'హర్తుర్యాతి న గోచరం కిమపిశం పుష్ణాతి యత్సర్వదా వ్యర్థిభ్య ప్రతిపాద్యమానవనిశం ప్రాపోన్తి వృద్ధింపరాం'. విద్యా ధనాన్ని దొంగలు దోచుకోలేరు. ఆ ధనం మనల్ని ఉన్నతుల్ని చేస్తుంది. ఆ ధనం ఎంత ఇచ్చినా తరగని నిధి.

మన దేశంలో ఉన్నత విద్యారంగాన్ని పరిశీలిస్తే 1100కి పైగా విశ్వవిద్యాలయాలు, 15,000 కళాశాలలు ఉన్నాయి. అయితే భారతీయ విశ్వవిద్యాలయాల నుంచి మనకు అనుకున్నంత జ్ఞాన సంపద ఉత్పత్తి కావటం లేదు. శాస్త్ర జ్ఞానానికి సంబంధించి ప్రోత్సాహం చాలా బలహీనంగా ఉంది. ముఖ్యంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉన్నత విద్యకు నిధులు బాగా తగ్గిపోయాయి. సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధికి బదులుగా మూఢాచారాలు, కథనాత్మక అంశాలను పెంచే వైపు దృష్టి పెడుతున్నారు. శాస్త్ర జ్ఞానం మానవాభివృద్ధికి మూలం. సాంకేతిక విజ్ఞాన అభివృద్ధే మానవాభ్యుదయాన్ని నిర్దేశిస్తుంది. ఎక్కువ మంది అధ్యాపకులు భౌతిక శాస్త్రాన్ని, రసాయన శాస్త్రాన్ని వృక్ష శాస్త్రాన్ని, జంతు శాస్త్రాన్ని అభివృద్ధి చేయడానికి సంబంధించిన వనరులు లేక ఇతర దేశాల మీద ఆధారపడుతున్నారు. మన భౌతిక శాస్త్ర మేధావి సి.వి.రామన్, నవ్య భౌతికవాద విస్తృతి గురించి ఎన్నో విషయాలు చెప్పారు. ఇటీవల భారతదేశంలో మెరుగైన అంశం మహిళా విద్యార్థుల శాతం పెరగటం ఒక ఉత్తేజం. అయితే విద్యార్థినులకు ప్రోత్సాహం రావలసినంత రావడం లేదు. లేకుంటే ఇంకా ద్విగుణీకృతంగా వారు విజృంభిస్తారు. ఈ విషయంగా విద్యా నిపుణులు ఇలా విశ్లేషిస్తున్నారు. పేద, మధ్యతరగతి వర్గాలకు ఉన్నత విద్యను అందించడానికి ఎస్.పి.యు (స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీ)లు అంకితమయ్యాయి. 2021-22లో ఎస్.పి.యు లలో చేరిన విద్యార్థుల్లో 48.2 శాతం అమ్మాయిలే. ఇది అన్ని విశ్వవిద్యాలయాలలోని విద్యార్థినుల సంఖ్యకన్నా 5.5 శాతం ఎక్కువ. 2011-12లో ఎస్.పి.యులలో చేరిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విద్యార్థుల సంఖ్య 99.5 లక్షలు కాగా, 2021-22 కల్లా అది సుమారు 2.30 కోట్లకు పెరిగింది. మన దేశ ఉన్నత విద్యా వ్యవస్థకు ఎస్.పి.యు లే వెన్నెముక. 81 శాతం ఉన్నత విద్యాభ్యాసం వీటిలోనే జరుగుతోంది. జాతీయ విద్యా విధానం వీటిలోనే జరుగుతోంది.

జాతీయ విద్యా విధానం విజయవంతం కావాలన్నా, 2047 కల్లా వికసిత భారత్‌ను సాధించాలన్నా నిపుణ మానవ వనరులను తయారు చేయడం అవసరం. భారత్‌ను విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దడం ముఖ్యం. ఈ లక్ష్య సాధనలో ఎస్.పి.యు లదే ప్రధాన పాత్ర. కానీ ఎస్.పి.యు లలో 40 శాతం అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని నీతి ఆయోగ్ విధాన పత్రం వెల్లడించింది. ప్రతి 15 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు అవసరం కాగా వీటిలో ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉన్నారు. 60 శాతానికి పైగా ఎస్.పి.యు లకు తగినన్ని హాస్టల్ వసతులు లేవు. దాంతో గ్రామాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ఎస్.పి.యు లలో చేరి చదువుకోలేకపోతున్నారు. నిజానికి భారతదేశంలో విశ్వవిద్యాలయాలన్నింటిలో కులతత్వం, మతతత్వాన్ని మనం నిర్మూలించగలిగితే విద్య సామాన్యులకు కూడా అందే అవకాశం ఉంటుంది. బోటనీ, జువాలజీలను ఎక్కువగా గిరిజనులు త్వరగా ఒంటపట్టించుకోగలరనే విషయం మనకు తెలిసిందే. నివసించే ప్రాంతాల జీవన ప్రమాణాలు విద్య మీద ప్రతిఫలిస్తాయి. వృత్తికారులైన బి.సి.లు, వ్యవసాయ కూలీలుగా ఉన్న దళితులు సాంకేతిక విద్యలో ముందున్నారు. కాని వారికి అవకాశాలు మృగ్యమవుతున్నాయి.

హెన్రిక్ సైంకేవిక్జ్, రుడ్‌యార్డ్ కిప్లింగ్, మారిస్ మేటర్‌లింక్, గెర్హార్ట్ హాప్ట్‌మాన్, అనతోల్ ఫ్రాన్స్, విలియం బట్లర్ ఈట్స్, జార్జి బెర్నార్డ్ షా, గ్రేజియా డెలాడా, థామస్ మాన్, జాన్ గాల్స్‌వరీ, ఇవాన్ బునిన్, లూయిజీ పిరాండెల్లో, పెర్ల్ ఎస్.బక్, పార్ లాయర్ క్విస్ట్, ఎర్నెస్ట్ హెమింగ్వే, ఆల్బర్ట్ కామూ, జాన్ స్టీన్‌బెక్, జాపాల్ సార్త్ర్, మిఖైల్ షోలొఖోవ్...ఇలా అతి చిన్న దేశాల వారు ఎందరో నోబెల్ బహుమతి పొందారు. విద్యకు విద్యోన్నతికి జాతి, భాష, కులం లేదని నిరూపించారు. మన దేశంలో కూడా నోబెల్ బహుమతి స్థాయికి వెళ్ళగల్గిన విద్యార్థులు ఎంతో మంది ఉన్నారు. వారికి మనం తగిన ప్రోత్సాహం ఇవ్వవలసిన అవసరం వుంది. ముఖ్యంగా ఉపకార వేతనాలు పెంచాలి. హాస్టల్ వసతులు పెంచాలి. ల్యాబ్‌లు పెంచి విస్తృతం చేయాల్సి వుంది. జి.డి.పి.లో మనం బడ్జెట్ ఎక్కువ పెంచాలి. అప్పుడే మన విద్యా వ్యవస్థ విస్తృత స్థాయికి వెళుతుంది. ఈ విషయంగా డా॥బి.ఆర్. అంబేద్కర్ ఆనాడే విద్య మానవాభివృద్ధికి, మానవ జీవన వ్యవస్థల ప్రజ్వలనానికి మూల శక్తి అని చెప్పారు. అంటరానితనం నిర్మూలన, కుల నిర్మూలన, ఆర్థిక అసమానతల నిర్మూలన, రాజ్యాంగ ప్రతిఫలనం, సామాజిక సమతుల్యతతో ప్రపంచ దేశాలకు భారత దేశానికి అనుసంధానత పెరుగుతుందని చెప్పారు.

దేశంలో మేధస్సుకి ఏనాడూ కొరత లేదు. దాని అభివృద్ధి కోసం మేధస్సును పెంచే ప్రభుత్వాలు, కవులు, ప్రజలు, విశ్వవిద్యాలయాలకు ధనవంతులు విస్తృతంగా దానాలు ఇవ్వాలి. విశ్వవిద్యాలయాలు విద్యార్థులను ప్రపంచ స్థాయికి ఎదిగేలా కృషి చేయాలి. విద్యకు ఆర్థిక అభివృద్ధికి, విద్యకు మానవాభ్యుదయానికి, విద్యకు రాజ్యాంగ ప్రతిఫలనానికి, విద్యకు వ్యక్తిత్వ నిర్మాణానికి వున్న అవినాభావ సంబంధాన్ని ప్రజలు, ప్రభుత్వాలు, ధనవంతులు, చదువుకునే విద్యార్థులు గుర్తించాలి. అప్పుడే భారతదేశ విద్యా వ్యవస్థ ఉన్నత స్థాయికి ఎదుగుతుంది.

/ వ్యాసకర్త సెల్ : 9849741695 /

నేడు 108 మండలాల్లో వడగాడ్పులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : 108 మండలాల్లో బుధవారం వడగాడ్పులు వీచే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. మంగళవారం నంద్యాల జిల్లా రుద్రవరంలో 41.6 డిగ్రీలు, ప్రకాశం జిల్లా దరిమడుగు 41.1, నెల్లూరు జిల్లా సోమశిల 40.9, అన్నమయ్య జిల్లా పూతనవారిపల్లె, చిత్తూరు జిల్లా పి పల్లి, వైఎస్ఆర్ కడప జిల్లా అట్లూరు 40.1 , తిరుపతి జిల్లా రేణిగుంటలో 40 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం శ్రీకాకుళం జిల్లాలో 15, విజయనగరం 21, పార్వతీపురం మన్యం, 10, అల్లూరి సీతారామరాజు, పల్నాడులో 8, అనకాపల్లి, కాకినాడలో 7, అంబేద్కర్ కోనసీమ 3, తూర్పుగోదావరి 13, ఏలూరు 5, కృష్ణా 2, ఎన్‌టిఆర్ 6, గుంటూరు 3 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశముందని తెలిపారు.

డిఇఒ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నాయకులు

ఊరు బడిని కాపాడండి

- ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాల విజ్ఞప్తి
- డిఇఒ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ

ప్రజాశక్తి- పార్వతీపురం

'మా ఊరు బడిని కాపాడండి' అంటూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నాయకులు ప్రదర్శన జరిపారు. పార్వతీపురం డిఇఒ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వ విద్యారంగంలో తీసుకొస్తున్న వినాశనకర విధానాలను విరమించుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ ప్రతి పంచాయతీకి ఒక మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని, ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను వేరు చేయొద్దని డిమాండ్ చేశారు. ఎల్‌కెజి, యుకెజి తరగతులను 1, 2 తరగతులతో నడపాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ యుపి పాఠశాలల ఎత్తివేత ఆలోచన విరమించుకోవాలని, విద్యార్థులను ప్రభుత్వ విద్యకు దూరం చేయొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి మాట్లాడుతూ ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే చర్యలను ప్రభుత్వం విడనాడాలన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన 117 ఒజను రద్దు చేస్తున్నట్టు చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం తిరిగి అవే విధానాలను అమలు చేసి పాఠశాలల మూతకు కారణమవుతోందని తెలిపారు. పాఠశాలల ఎత్తివేత నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల తల్లిదండ్రులను కూడగట్టి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిఆర్ఒ కె.హేమలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట రమేష్, కె.భాస్కరరావు, జిల్లా నాయకులు కె.జానకీరావు, జ్యోతి, అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు!

- ఆందోళనలో చిరుద్యోగులు

అమరావతి : సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 15 నుంచి 25 ఏళ్లగా పనిచేస్తున్న నాన్ టీచింగ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించేందుకు రంగం సిద్ధమైంది. జువెనల్ జస్టిస్ కమిటీ పేరుతో బాలికల పాఠశాలల్లో పనిచేస్తున్న వారిని బాలుర పాఠశాలకు అడ్జస్ట్ చేసి, మిగిలిన వారిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు డ్యూటీ చేసే వీరికి విద్యార్థులతో ఎటువంటి సంబంధాలు ఉండవు. అయినప్పటికీ జువెనల్ జస్టిస్ పేరుతో జనవరి నెలలో సుమారు 97 మందిని బదిలీ చేశారు. తక్కువ జీతంతో రూ.16411/-, రూ.13087/- పనిచేస్తున్న వీరిని వంద నుంచి 150 కిలోమీటర్లు దూరంలో ఉన్న బాయ్స్ స్కూల్‌కు బదిలీ చేశారు. ఇప్పుడు బాలికల పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 65 మందికి ఉద్వాసన పలికేందుకు కసరత్తు చేస్తున్నారు. తొలగించిన పోస్టుల్లో కొత్త వారిని నియమించుకోవడం ద్వారా ఒక్కో పోస్టుకు రూ.5 లక్షల వరకు వసూలు చేసేందుకు ఎపిఎస్‌డబ్ల్యుఆర్‌ఇఐఎస్ సంస్థకు చెందిన ఒకరు ప్రయత్నిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

1 నుంచి ఉద్యోగాల్లోకి రావద్దంటున్నారు

ఏప్రిల్ 1 వ తేదీ నుండి విధుల్లోకి రానీయొద్దని ప్రిన్సిపాళ్లకు కొంత మంది డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్లు చెప్పారని పేరు చెప్పడానికి ఇష్టపడని అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకూ విధులు నిర్వహిస్తూ... విద్యార్థులతో నేరుగా ఎటువంటి సంబంధాలు ఉండని తమను ఉద్యోగాల్లో కొనసాగించాలని వారు సిఎం, డిప్యూటీ సిఎం, విద్యాశాఖ, సాంఘిక సంక్షేమశాఖ మంత్రులను కోరుతున్నారు.

నెత్తుటి తడారని దంతేవాడ

- తెలంగాణకు చెందిన సుధీర్ సహా ముగ్గురు మావోయిస్టులు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, దంతెవాడ సరిహద్దు దండకారణ్యంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో ముగ్గురు మావోయిస్టులు పోలీసు తూటాలకు బలైపోయారు. దంతెవాడ ఎస్పీ గౌరవరాయ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం 8:00 గంటల నుంచి భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య తీవ్ర కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు. వీరిలో మావోయిస్టు పార్టీ దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి సుధీర్ అలియాస్ సుధాకర్, అలియాస్ మురళి (వరంగల్ జిల్లా) కూడా ఉన్నారు. మరో ఇద్దరు స్పెషల్ జోనల్ కమిటీ దళ సభ్యులు ఆరేరా పాండు, బారసా మున్నా గుర్తించారు. ఎన్‌కౌంటర్ ప్రదేశం నుంచి భద్రతా బలగాలు పెద్ద ఎత్తున ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాయి. ఐఎన్ఎస్ఎస్ రైఫిల్, 303 రైఫిల్, 12 బోర్ రైఫిల్, మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని, ఇంకా మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టినట్టు పోలీసులు తెలిపారు. కాగా, 2025లో ఇప్పటివరకు భద్రతా దళాల ఆపరేషన్‌లో మొత్తం 100 మంది పైగా మావోయిస్టులు చనిపోయినట్లు ఎస్పీ తెలిపారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌లో సాధించిన పెద్ద విజయంగా ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది మూడు నెలల్లో ఛత్తీస్‌గఢ్ వ్యాప్తంగా సుమారు 130 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందినట్లు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు.

భారత్-బంగ్లాదేశ్ ఫుట్‌బాల్ మ్యాచ్ డ్రా

షిల్లాంగ్: ఎఎఫ్‌సి ఆసియాకప్ క్వాలిఫయర్స్‌కు భారత్-బంగ్లాదేశ్ జట్ల మధ్య జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్ డ్రా అయ్యింది. గ్రూప్-సిలో భాగంగా జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్ నిర్ణీత రెండు అర్ధభాగాలు ముగిసేసరికి ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. దీంతో మ్యాచ్ 0-0తో డ్రా అయ్యింది.

ఫిఫా ప్రపంచకప్‌కు చేరువలో ఆస్ట్రేలియా

ఫిఫా ప్రపంచకప్ 2026కు అర్హత సాధించేందుకు ఆస్ట్రేలియా చేరువైంది. హాంగ్జౌ వేదికగా మంగళవారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఆస్ట్రేలియా 2-0గోల్స్‌తో చైనాను చిత్తుచేసింది.

3వ ర్యాంక్‌లో మంధాన, దీప్తి శర్మ

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసిసి) ప్రకటించిన తాజా టి20 మహిళల ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ బ్యాటర్లు స్మృతి మంధాన, దీప్తి శర్మ తమ తమ ర్యాంకింగ్స్‌ను మెరుగు పరుచుకున్నారు. వీరిద్దరూ టాప్-10లో నిలువగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 11వ, జెమిమా రోడ్రిగ్స్ 15వ స్థానాల్లో నిలిచారు. ఐసిసి మంగళవారం విడుదల చేసిన టి20 బ్యాటర్ల జాబితాలో వైస్ కెప్టెన్ మంధాన(743 రేటింగ్ పాయింట్లు) మూడో స్థానంలో నిలువగా.. ఆస్ట్రేలియాకు చెందిన బెత్ మూనీ(798), తహియా మెక్‌గ్రాత్(756) టాప్ 1, 2 ర్యాంకింగ్స్‌లో ఉన్నారు. హర్మన్ 628పాయింట్లతో 11వ, రోడ్రిగ్స్(619), షెఫాలీ వర్మ(617), 15, 16 స్థానాల్లో ఉన్నారు. ఇక మహిళల టి20 ఆల్‌రౌండర్ల జాబితాలో దీప్తి శర్మ(392పాయింట్లు) మూడో స్థానంలో నిలువగా.. వెస్టిండీస్ స్టార్ హేలీ మాథ్యూస్(479), న్యూజిలాండ్‌కు చెందిన అమేలియా కెర్(430) టాప్ 1, 2 స్థానాల్లో ఉన్నారు.

2032 ఒలింపిక్స్ తర్వాత గబ్బా స్టేడియం కూల్చివేత

సిడ్నీ: ఆస్ట్రేలియా ప్రధాన స్టేడియాల్లో ఒకటైన గబ్బా స్టేడియం త్వరలోనే నేలమట్టం కానుంది. 2032లో జరిగే ఒలింపిక్స్ అనంతరం గబ్బాను కూల్చి వేయనున్నట్లు మంగళవారం క్వీన్స్‌లాండ్ ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. గబ్బా స్టేడియాన్ని 1895లో నిర్మించగా.. ఈ మైదానం దేశవాళీ, అంతర్జాతీయ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. దాదాపు 130 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ స్టేడియం నిర్వహణను అధికారులు సరిగా పట్టించుకోకపోవడంతో కొంత భాగం శిథిలావస్థలో ఉంది. ఆటగాళ్ల భద్రత, స్టేడియం పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని కూల్చివేయడమే పరిష్కారమని అధికారులు భావిస్తున్నారు. అలాగే విక్టోరియాలో 63 వేల సీట్ల సామర్థ్యంతో కొత్త స్టేడియం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

FINKURVE FINANCIAL SERVICES LIMITED
Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202/A, Kamala Mill Compound, Lower Parel (W), Mumbai, Maharashtra - 400013
PUBLIC NOTICE
ఫిన్‌కుర్వే ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం 29.03.2025 న 10:00 గంటలకు Finkurve Financial Services Limited లోనిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేయడం D.NO-4-16-368, 1st Floor, 1st Shop, 4th Line, Potti Sriramula Nagar, Guntur - 522002. వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయుచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో. విఫలమైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.
RSR ASSOCIATE ARVOG F:
RSRA-13353, RSRA-74812, RSRA-31663.
For More Details, Contact : Raju, Mobile : 9701920907
(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

FINKURVE FINANCIAL SERVICES LIMITED
Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202/A, Kamala Mill Compound, Lower Parel (W), Mumbai, Maharashtra - 400013
PUBLIC NOTICE
ఫిన్‌కుర్వే ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం 29.03.2025 న 10:00 గంటలకు Augmont Goldtech Private Ltd. లోనిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేయడం D. No. 14-122/1, Srinivasa Nilayam,1st Floor, Bandar Road, Opp. Ganganamma Temple, Poranki, Vijayawada 521137. వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయుచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో. విఫలమైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.
PORANKI ARVOG BRANCH : VIJA-40897, VIJA-27220, VIJA-45341, VIJA-61773, VIJA-69785, VIJA-53291, VIJA-58916, VIJA-14567, PORA-47767, VIJA-34753, VIJA-89802, VIJA-72269, PORA-73799, VIJA-76155, VIJA-41641, VIJA-18503, VIJA-30373.
More Details, Please Contact : Pappuru Nagaraju, Mobile : 9704755679
(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

Chola Enter a better life
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు : "చోళా క్రెస్ట్", సి54 మరియు 55, సూపర్ బి-4, తిరు.వి.క. ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.
శాఖ చిరునామా : ఇంటి నం.6-9-23, వార్డు 3, 9వ లేన్, 2వ అంతస్తు, అరండల్‌పేట, గుంటూరు-522002.
(రూల్ 8(1)) స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)
ఏదైతే, దిగువసంతకందారు అయిన మెసర్స్.చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 [illegible]

క్ర. సం.	రుణగ్రహీత/లు మరియు చిరునామా మరియు లోన్ ఖాతా నం.	డిమాండ్ నోటీసు తేదీ	బకాయి మొత్తం	స్వాధీనత తేదీ
[A]	[B]	[C]	[D]	[E]
1	లోన్ అకౌంట్ నెం.: HE01GUN00000828215 [illegible]	06-12-2024	06.12.2024 నాటికి రూ. 24,50,354/- మరియు దానిపై వడ్డీ	22-03-2025

స్థిరాస్తి వివరణ: [illegible]
తేది: 26.03.2025
ప్రదేశం : గుంటూరు
సం/- అధీకృత అధికారి, మెసర్స్.చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనమైంది)
IDFC FIRST Bank
CIN: L65110TN2014PLC097792
రిజిష్టర్డ్ ఆఫీసు: కెఆర్ఎం టవర్స్, 8వ అంతస్తు, హారింగ్టన్ రోడ్, చెట్‌పేట్, చెన్నై-600031.
అనుబంధం 4 (రూల్ 8(1)) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
[illegible] 24.12.2022 [illegible] రూ.64,37,898/- [illegible]
స్థిరాస్తి వివరణ: [illegible]
తేది: 20.03.2025
ప్రదేశం: ఆం.ప్ర.
లోన్ ఖాతా నం: 10041644091
సం/- అధీకృత అధికారి, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్

నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
nido HOME FINANCE
(గతంలో ఈడల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడినది) నమోదిత కార్యాలయం: 5వ ఫ్లోర్, టవర్ 3, వింగ్ బి, కోహినూర్ సిటీ మాల్, కోహినూర్ సిటీ, కిరోల్ రోడ్, కుర్లా (వెస్ట్), ముంబయి 400070. శాఖా కార్యాలయం చిరునామా : 4వ అంతస్తు, జానకి అవెన్యూ, నం.1-11-220/15, బృందావన్ కాలనీ, ప్లాట్ నం.2, బేగంపేట, హైదరాబాద్-500016.
ఇ-వేలం-చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకపు ప్రకటన
సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 మరియు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ 2002, క్రింద ఇ-వేలం ద్వారా విక్రయం.
సాధారణ ప్రజలకు, ముఖ్యంగా రుణగ్రహీత/హామీదారులకు ఈ నోటీసు ద్వారా తెలియచేయునది ఏమనగా రుణబకాయిల రికవరీ ప్రక్రియ పూర్తయ్యే వరకూ జమ అయ్యే వడ్డీ, ఇతర వర్తించే ఖర్చులు, ఛార్జీల కోసం ఈ దిగువ పేర్కొనబడిన ఆస్తి 'ఎక్కడ ఎలా వున్నది అలా, అక్కడ ఏది వుంటే అది' అన్న ప్రాతిపదికపై విక్రయించబడును. ఈ దిగువ పేర్కొన్న ఆస్తిని రుణగ్రహీత(లు), సహరుణగ్రహీత(లు), హామీ దారు(లు) పొందిన రుణ సౌకర్యాల కోసం మెస్సర్స్ నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఈడల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడినది) కు తనఖా పెట్టబడినవి. ఈ దిగువ పేర్కొనబడిన సెక్యూర్డ్ అస్సెట్స్‌ను సెక్యూర్డ్ క్రెడిటార్ భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు.

క్ర. సం	రుణగ్రహీత/సహ రుణగ్రహీత/ హామీదారుల పేరు	రికవరీ మొత్తం	రిజర్వు ధర& ధరావత్తు	వేలం తేది & సమయం
12	జగదీష్ లంకే (రుణగ్రహీత) లంకే దిలీప్ కుమారి (సహ-రుణగ్రహీత)	లాన్ నెం.LVIJSBI0000095969 కొరకు 20.03.2025 నాటికి రూ.34,36,230.04/- (రూపాయిలు ముప్పై నాలుగు లక్షల ముప్పై ఆరు వేల రెండు వందల ముప్పై & నాలుగు పైసలు మాత్రమే) + దానిపై తదుపరి వడ్డీ+ లీగల్ వ్యయాలు.	రూ.40,63,395 /- (రూపాయలు నలభై లక్షలు అరవైమూడు వేల మూడు వందల తొంభై ఐదు మాత్రమే) ధరావత్తు : రూ.4,06,339.5/- (రూపాయలు నాలుగు లక్షల ఆరువేల మూడువందల ముప్పై తొమ్మిది & ఐదు పైసలు మాత్రమే)	06-05-2025 ఉ॥ 11గం.ల నుండి మ॥ 12గం.ల మధ్య (5 నిమిషాల అపరిమిత ఆటో పొడిగింపుతో)

తనిఖీచేయు తేది& సమయం: 10-04-2025 ఉ॥ 11.00గం.లు నుండి మ॥ 3.00గం.ల మధ్య | లాంఛనప్రాయ స్వాధీనతా తేది: 27-01-2025
సెక్యూర్డు అసెట్ వివరణ: పాత అసిస్టెంట్ నెం.39912, కొత్త 1070017783, మున్సిపల్ న్యూ వార్డ్ నెం.30, మచిలీపట్నం, కృష్ణ-521001 లోని 200.75 చ.గ.లు లేదా 167.85 చ.మీ.ల పూర్తి విస్తీర్ణంలోని డి.నెం.30/899-1 కలిగిన ఆస్తి మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం: బొడ్డు వెంకటేశ్వరమ్మ ఆస్తి, దక్షిణం: పీతా నాగేశ్వరరావు ఆస్తి, తూర్పు:మున్సిపల్ మార్గం మరియు కె.రుక్మేందర్ ఆస్తి, పడమర: మున్సిపల్ రోడ్డు.
గమనిక : 1. వేలం ప్రక్రియ ఆన్‌లైన్‌లో https://sarfaesi.auctiontiger.net ద్వారా నిర్వహించబడును. కేవలం తమ ఇ-మెయిల్, ఐడి ప్రూఫ్, ఫొటోప్రూఫ్, పాన్‌కార్డ్ కలిగి, ఇఎండిని DEMAND DRAFT/ NEFT/RTGS ద్వారా చెల్లించిన బిడ్డర్లు మాత్రమే ఆన్‌లైన్ ఇ-వేలంలో పాల్గొనేందుకు అర్హులు.
2. ఆసక్తి కలిగిన బిడ్డర్లు తమ ఇఎమ్‌డిని డిమాండ్ డ్రాఫ్ట్/ఆర్‌టిజిఎస్/ఎన్ఇఎఫ్‌S ద్వారా చెల్లించాల్సి వుంటుంది. లబ్ధిదారుని పేరు : నీడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్యాంక్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నం.: 65226845199, SARFAESI- Auction, నీడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ IFSC code: SBIN0001593.
3. ఇఎమ్‌డితో సహా ఆన్‌లైన్‌లో బిడ్‌ఫారమ్ దరఖాస్తును దాఖలు చేయుటకు చివరి తేదీ 05.05.2025
4. విక్రయం యొక్క వివరమైన నియమ నిబంధనల కోసం https://sarfaesi.auctiontiger.net లేదా శ్రీ.మౌలిక్ శ్రీమలి ఫోన్ 91- 6351896643/9173528727 ద్వారా కానీ, హెల్ప్‌లైన్ ఇ-మెయిల్ ఐడి Support@auctiontiger.net. ద్వారా కానీ సంప్రదించగలరు.
మొబైల్ నెం.7207645328/ 8885161710/ 8885462308
తేది: 26-03-2025
సం/- అధీకృత అధికారి
నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఈడల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేర్కొనబడినది)

నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
nido HOME FINANCE
(గతంలో ఈడల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడినది) నమోదిత కార్యాలయం: 5వ ఫ్లోర్, టవర్ 3, వింగ్ బి, కోహినూర్ సిటీ మాల్, కోహినూర్ సిటీ, కిరోల్ రోడ్, కుర్లా (వెస్ట్), ముంబయి 400070. శాఖా కార్యాలయం చిరునామా : 4వ అంతస్తు, జానకి అవెన్యూ, నం.1-11-220/15, బృందావన్ కాలనీ, ప్లాట్ నం.2, బేగంపేట, హైదరాబాద్-500016.
ఇ-వేలం- చట్టబద్ధమైన 15 రోజుల విక్రయ నోటీసు
సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 మరియు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ 2002, క్రింద ఇ-వేలం ద్వారా విక్రయం.
సాధారణ ప్రజలకు, ముఖ్యంగా రుణగ్రహీత/హామీదారులకు ఈ నోటీసు ద్వారా తెలియచేయునది ఏమనగా రుణబకాయిల రికవరీ ప్రక్రియ పూర్తయ్యే వరకూ జమ అయ్యే వడ్డీ, ఇతర వర్తించే ఖర్చులు, ఛార్జీల కోసం ఈ దిగువ పేర్కొనబడిన ఆస్తి 'ఎక్కడ ఎలా వున్నది అలా, అక్కడ ఏది వుంటే అది' అన్న ప్రాతిపదికపై విక్రయించబడును. ఈ దిగువ పేర్కొన్న ఆస్తిని రుణగ్రహీత(లు), సహరుణగ్రహీత(లు), హామీ దారు(లు) పొందిన రుణ సౌకర్యాల కోసం మెస్సర్స్ నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఈడల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడినది) కు తనఖా పెట్టబడినవి. ఈ దిగువ పేర్కొనబడిన సెక్యూర్డ్ అస్సెట్స్‌ను సెక్యూర్డ్ క్రెడిటార్ భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు.

క్ర. సం	రుణగ్రహీత/సహ రుణగ్రహీత/ హామీదారుల పేరు	రికవరీ మొత్తం	రిజర్వు ధర& ఇఎమ్‌డి	వేలం తేది & సమయం
12	దూపాటి శ్రీకాంత్ (రుణగ్రహీత), దూపాటి అనూష (సహ రుణగ్రహీత)	ఎల్ఎఎన్ నెం. LVIJSBI0000095925 కొరకు 25.03.2025 నాటికి రూ.18,33,051.08/- (పద్దెనిమిది లక్షల ముప్పై మూడు వేల యాభై ఒక్క రూపాయల ఎనిమిది పైసలు మాత్రమే) దానిపై తదుపరి వడ్డీ + చట్టపరమైన ఖర్చులు.	రూ.16,40,250/- (పదహారు లక్షల నలభై వేల రెండు వందల యాభై రూపాయలు మాత్రమే) బయానా మొత్తం : రూ.1,64,025/- (ఒక లక్షా అరవై నాలుగు వేల ఇరవై ఐదు రూపాయలు మాత్రమే)	22/04/2025, ఉ.11 గం.ల నుండి మ.12 గం.ల మధ్య (5 నిమిషముల అపరిమిత స్వీయ పొడిగింపుతో)

తనఖీ తేది మరియు సమయం : 09.04.2025, ఉ.11.00 గం. నుండి మ.3.00 గం. మధ్య | భౌతిక స్వాధీనతా తేది : 13.11.2024
సెక్యూర్డ్ అస్సెట్ వివరణ : విజయవాడ-520010, లబ్బీపేట, ఎన్‌టిఎస్ నం.80 బ్లాక్ 4, కొత్త మున్సిపల్ వార్డు నం.27, మూల్యాంకనం నం.216188 , బేరింగ్ గ్రౌండ్ ఫ్లోర్ జి2, డో.నం.40-1-145/1 మొత్తం ఆ భాగం మరియు పార్సిల్ తో విస్తీర్ణం 35 చ.గ.లు. హద్దులు : ఉత్తరం : నందిగామ్ సమాధానం ఆస్తి, దక్షిణం : దూపాటి అబ్రహాం ఆస్తి, తూర్పు : 6.0 అ.లు. వెడల్పు బజారు, పడమర : నందిగామ విలియం ఆస్తి.
గమనిక : 1. వేలం ప్రక్రియ ఆన్‌లైన్‌లో https://sarfaesi.auctiontiger.net ద్వారా నిర్వహించబడును. కేవలం తమ ఇ-మెయిల్, ఐడి ప్రూఫ్, ఫొటోప్రూఫ్, పాన్‌కార్డ్ కలిగి, ఇఎండిని DEMAND DRAFT/ NEFT/RTGS ద్వారా చెల్లించిన బిడ్డర్లు మాత్రమే ఆన్‌లైన్ ఇ-వేలంలో పాల్గొనేందుకు అర్హులు.
సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై ఋణగ్రహీతలు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

స్థిరాస్తుల వివరణ:

తాడెపల్లి, తాడెపల్లి మున్సిపల్ ఏరియా, మంగళగిరి సబ్-రిజిస్ట్రీ, గుంటూరు జిల్లా, ఆం.ప్ర-322501 యొక్క ఆర్.ఎస్.నం.71 లో ప్లాట్ నం.10లో అసెస్మెంట్ నం.1143013770, పాత డోర్ నం.13-54/ఎ, డోర్ నం.13-56/1/19తో దానిలో భవనముతోపాటు, పూర్తి విస్తీర్ణం 181చ.గ.లకుగాను తూర్పు వైపున 94.8చ.గ.లు లేదా 700చ.అ.ల విస్తీర్ణపు సైటు యొక్క ఆస్తి మొత్తం భాగం మరియు **సరిహద్దులు: తూర్పు:** 20అ.ల వెడల్పు రోడ్డు, **పడమర:** శ్రీమతి కొక్కిలిగడ్డ లక్ష్మికు విక్రయించిన ఆస్తి, **ఉత్తరం:** నాటిపల్లి మారాజు ఆస్తి, ప్లాట్ నం.9లో బేబి, **దక్షిణం:** 20అ.ల వెడల్పు రోడ్డు.

సం/-
అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనమైనది)
తేది:19.03.2025
ప్రదేశం: ఆం.ప్ర.
లోన్ ఖాతా నం:75807089.

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు
ICICI Home Finance
నమోదిత కార్యాలయం : ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (తూర్పు), ముంబై-400051
కార్పొరేట్ కార్యాలయం : ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి టవర్, జెబి నగర్, అంధేరి కుర్లా రోడ్డు, అంధేరి తూర్పు, ముంబై-400059
శాఖా కార్యాలయం : సూర్య టవర్స్, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, డో.నం.5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002.

ఏదైతే
దిగువ సంతకందారు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో ఋణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
ఋణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.
ఋణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

క్ర. సం.	ఋణగ్రహీత/ సహ ఋణగ్రహీత పేరు/ లోను ఖాతా సంఖ్య	ఆస్థి వివరణ/స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)	శాఖ పేరు
1.	షేక్ నాగుల్ మీర (ఋణగ్రహీత), షేక్ నాగుల్ బి (సహ ఋణగ్రహీత)/ LHGTR00001408621	డో.నం.7-55, డో.నం.333 1 లెమల్లె గ్రామ పంచాయతీ అమరావతి గుడి వద్ద 333/1 గుంటూరు ఆంధ్రప్రదేశ్-522016. హద్దులు : ఉత్తరం : సి షెడ్యూల్ ఆస్తి, దక్షిణం : ఎ షెడ్యూల్ ఆస్తి, తూర్పు : షేక్ హుస్సేన్ సాహెబ్ ఆస్తి, పడమర : పంచాయతీ బజారు/ స్వాధీనతా తేది : 20.03.2025	23-12-2024 Rs. 5,52,735.12/-	గుంటూరు

పైన పేర్కొన్న ఋణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.
తేది : 26 మార్చి, 2025, ప్రదేశం : గుంటూరు
అధీకృత అధికారి, ఐసిఐసిఐ హోం ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

చిన్నారుల సంరక్షణ లగ్జరీ కాదు.. ప్రాథమిక సేవ

- రాజ్యసభ ఎంపి ఫౌజియా

న్యూఢిల్లీ : చిన్నారుల సంరక్షణను లగ్జరీగా కాకుండా...ప్రాథమిక సేవగా పరిగణించాలని రాజ్యసభలో ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంపీ ఫౌజియా ఖాన్ మంగళవారం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జీరో అవర్ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ భద్రతా దళాలలో విధులు నిర్వహిస్తున్న మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి సంస్థాగత సంస్కరణలు చేపట్టాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా ఇటీవల వైరల్‌గా మారిన తన ఏడాది వయసున్న బిడ్డను ఛాతీకి కట్టుకుని స్టేషన్‌లో గస్తీ నిర్వహిస్తున్న ఒక రైల్వే పోలీస్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్) మహిళా కానిస్టేబుల్ ఫోటోను ఎంపి ప్రదర్శించారు. 'నారీ శక్తికి చిహ్నంగా ఆర్‌పిఎఫ్ ప్రశంసలు కురిపిస్తున్నా.. ఈ ఫోటో వాస్తవానికి భద్రతా దళాలలో మహిళా సిబ్బంది ఎదుర్కొంటున్న వ్యవస్థాగత సవాళ్లను, పని చేసే తల్లులకు ప్రాథమిక మద్దతు అందించడంలో వ్యవస్థ వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది' అని ఆమె పేర్కొన్నారు. అలాగే, 'మహిళలు తమ వృత్తిపరమైన, ప్రసూతి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలిగేలా ప్రతిచోటా టాయిలెట్లు, క్రెచ్‌లు, శిశువు సంరక్షణ లేదా తల్లిపాలు ఇచ్చే గదులు అవసరం' అని స్పష్టం చేశారు.

ఎకెజి మెమోరియల్ ప్రారంభం

తిరువనంతపురం : సీనియర్ నేత ఎకె గోపాలన్ వర్ధంతిని పురస్కరించుకొని కేరళ స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి ఎంబీ రాజేష్ 'ఎకెజి మెమోరియల్'ను ప్రారంభించారు.
మయిలదుత్తురై జిల్లాలోని తరంగంబాడిలో సిపిఎం ఏరియా కమిటీ కార్యాలయంలో దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యులు పి షణ్ముగం పార్టీ పతాకాన్ని, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె శామ్యూల్ రాజ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసన్ సమావేశ హాలును, ఎమ్మెల్యే విపి నాగై మాలి గ్రంథాలయాన్ని ప్రారంభించారు. పార్టీ 24వ అఖిల భారత మహాసభ ప్రాధాన్యతను వివరిస్తూ బహిరంగ సభను కూడా నిర్వహించారు.

అప్పటి వరకూ..జమ్మూకాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతమే

- ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్ రాష్ట్ర హోదాను పార్లమెంట్ పునరుద్ధరించే వరకూ వరకూ ఈ ప్రాంతం కేంద్రపాలిత ప్రాంతంగానే కొనసాగుతుందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మంగళవారం తెలిపారు. ఒక బిల్లులో 'కేంద్రపాలిత ప్రాంతం' అనే పదాన్ని ఉపయోగించడంపై ప్రతిపక్ష ఎమ్మెల్యేలు విమర్శలు, వాకౌట్ చేయడాన్ని ముఖ్యమంత్రి ఖండించారు. 'మనం ఇక్కడ 'కేంద్రపాలిత ప్రాంతం' అని ప్రస్తావించినంత మాత్రాన ఏమీ మారదు. దురదృష్టవశాత్తు, భారత పార్లమెంట్ మన రాష్ట్ర హోదాను పునరుద్ధరించే వరకూ మనం కేంద్రపాలిత ప్రాంతంగానే ఉంటాం. కాబట్టి దీనిని రాజకీయం చేయవద్దు' అని ముఖ్యమంత్రి చెప్పారు. వాకౌట్ చేయడం వలన ప్రయోజనం ఉండదని అన్నారు. 'జమ్మూకాశ్మీర్ ప్రజలకు మనం రాష్ట్రహోదా తిరిగివ్వాలి. మేం దాన్ని పునరుద్ధరిస్తాం. మీకు నచ్చినా నచ్చకపోయినా మనది కేంద్రపాలిత ప్రాంతం. ఈ ప్రభుత్వం కేంద్రపాలిత ప్రాంతంగానే పాలన సాగిస్తుంది' అని తెలిపారు.

ఉన్నావ్ అత్యాచారం కేసు.. బాధితకు సిఆర్‌పిఎఫ్ భద్రత కొనసాగింపు

న్యూఢిల్లీ : ఉన్నావ్ అత్యాచారం కేసు బాధితురాలికి సిఆర్‌పిఎఫ్ భద్రతా ఉపసంహరించడానికి సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. ఆమె ఇప్పటికీ బెదిరింపు ముప్పులో ఉన్నారని జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పిబి వరలేలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. అయితే బాధితురాలి కుటుంబ సభ్యులకు, ఇతర సాక్ష్యులకు సిఆర్‌పిఎఫ్ భద్రత ఉపసంహరించడానికి ధర్మాసనం అనుమతించింది. కుటుంబ సభ్యులు, ఇతర సాక్ష్యులకు ఇంకా ఏదైనా బెదిరింపులు వస్తే స్థానిక పోలీసులను సంప్రదించే స్వేచ్ఛ ఉందని ధర్మాసనం పేర్కొంది. మంగళవారం విచారణలో బాధితురాలికి భద్రత ఉపసంహరించుకోవడానికి కోర్టు అనుమతిని అదనపు సొలిసిటర్ జనరల ఐశ్వర్య భాటి కోరారు. ఈ కేసులో బిజెపి నాయకుడు కుల్దీప్ సింగ్ సెంగర్ దోషి నిర్ధారణయిందని, జీవిత ఖైదు శిక్షను కూడా అనుభవిస్తున్నారని కోర్టుకు తెలిపారు. అయితే ఈ వాదనను ధర్మాసనం తిరస్కరించింది.

విద్యుత్ కార్మికుల ఆందోళనలు విజయవంతం

న్యూఢిల్లీ : తమిళనాడు, తెలంగాణాలో మంగళవారం నిర్వహించిన విద్యుత్ ఒప్పంద కార్మికుల ఒక రోజు ధర్నా భారీ స్థాయిలో విజయవంతమైనందుకు తమ విభాగాలకు ఎలక్ట్రసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఇఎఫ్ఐ) అభినందనలు తెలిపింది. ఈ ధర్నాకు భారీ సంఖ్యలో ఒప్పంద కార్మికులను సమీకరించినందుకు ప్రశంసించింది. రాబోయే రోజుల్లోనూ కాంట్రాక్టు కార్మికుల కోసం పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ఇఇఎఫ్ఐ ప్రకటించింది. ఈ మేరకు ఇఇఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి సుదీప్ దత్తా ఒక ప్రకటన విడుదల చేశారు. తమిళనాడులోని 13 ప్రాంతీయ చీఫ్ ఇంజనీర్ల కార్యాలయాలు, మూడు థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో మంగళవారం భారీ నిరసన ప్రదర్శనలను సిఐటియు నిర్వహించింది. ఈ ప్రదర్శనల్లో 6,300కు పైగా కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు. దీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని, క్రమబద్ధీకరణ జరిగే వరకూ రోజువారీ వేతనాలను ప్రధాన యజమాని నేరుగా చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కూడా భారీ నిరసన ప్రదర్శనలు జరిగాయి.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ స్ఫూర్తితో

మదురైలో కదంతొక్కిన రెడ్‌షర్ట్ వలంటీర్స్

- బ్రిగేడ్ వలంటీర్ల రిహార్సల్ పరేడ్‌తో ఎరుపెక్కిన వీధులు
- సిపిఎం 24వ మహాసభ ర్యాలీకి సంసిద్ధం

చెన్నై : స్వతంత్ర పోరాటయోధులు, యువత హృదయాల్లో చెరగని ముద్ర వేసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ స్ఫూర్తితో వారి వర్ధంతి సందర్భంగా ఈ నెల 23న తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా రెడ్‌షర్ట్స్ వలంటీర్లు కదంతొక్కారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 24వ అఖిల భారత మహాసభ వచ్చే ఏప్రిల్ 2 నుంచి 6 వరకు మదురై నగరంలో నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ మహాసభలో సందర్భంగా చేపట్టబోయే రెడ్ షర్ట్స్ బ్రిగేడ్ ర్యాలీకి సన్నాహంగా గత ఆదివారం తమిళనాడు వ్యాప్తంగా రిహార్సల్స్ నిర్వహించారు.

మదురైలోని తముకం మైదానం (కామ్రేడ్ సీతారాం ఏచూరి నగరం)లో నిర్వహించే మహాసభకు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్న రెడ్‌షర్ట్స్ వలంటీర్ల ర్యాలీ ఏప్రిల్ 6న సాయంత్రం 3 గంటలకు తెప్పకుళం సమీపంలో ప్రారంభమవుతుంది. భారత విప్లవ పోరాటాల్లో ఒకటిగా నిలిచిన వాచతీ పోరాట యోధులు ఈ పరేడ్‌ను ప్రారంభించనున్నారు. తమిళనాడు వ్యాప్తంగా ఎంపిక చేసిన 25 వేల మంది రెడ్‌షర్ట్స్ వలంటీర్లు ఈ కవాతులో పాల్గొంటారు. శ్రామికవర్గ పోరాట యోధుల యూనిఫాం అయిన ఖాకీ, ఎరుపు దుస్తులు ధరించి ఎర్రజెండాల వెలుగులతో సాగే ఈ కవాతుతో మదురై నగరం ప్రజ్వలిల్లనుంది. ఈ మహా కవాతు కోసం పోరాట స్ఫూర్తి ప్రదాతలు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి రోజు అయిన గత ఆదివారం తమిళనాడులోని దాదాపు అన్ని జిల్లాల్లోనూ రిహార్సల్స్ నిర్వహించారు. మదురై జిల్లాలోని తెర్కల్లుపట్టిలో జరిగిన కవాతును మహాసభ ఆహ్వాన సంఘం ఛైర్మన్, కేంద్ర కమిటీ సభ్యులు కె బాలకృష్ణన్ ప్రారంభించగా, కాంచీపురంలో పార్టీ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి పి షణ్ముగం, మధురై నగరంలో ఆహ్వాన కమిటీ కార్యదర్శి, పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎస్ వెంకటేషన్ ప్రారంభించారు. అలాగే మిగిలిన జిల్లాల్లో కేంద్ర కమిటీ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యులు పరేడ్ ప్రారంభించి గౌరవ వందనం స్వీకరించారు.

జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన

- రాజ్యసభలో ప్రతిపక్షాలు డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టల వ్యవహారంపై విచారణకు ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మంగళవారం రాజ్యసభలో ఈ వ్యవహారాన్ని ప్రతిపక్షాలు లేవనెత్తాయి. నోట్ల కట్ల వ్యవహారంపై నిష్పాక్షికంగా దర్యాప్తు జరగాలని కొందరు సభ్యులు డిమాండ్ చేయగా మరికొందరు జస్టిస్ వర్మను అభిశంసించాలని సూచించారు. ఇది చాలా పెద్ద విషయమని, న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతిన్నదని ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో వర్మ ఇంట్లో నగదు రికవరీ అంశంపై చర్చించేందుకు రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు.

'జమిలి'పై జెపిసి గడువు పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఒకే దేశం-ఒకే ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ పదవీకాలాన్ని పొడిగించేందుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం కమిటీ పదవీకాలం ఏప్రిల్ 4 వరకు ఉంది. కమిటీ ఛైర్మన్ పిపి చౌదరి పదవీకాలాన్ని పొడిగించే తీర్మానాన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టగా.. వాయిస్ ఓటుతో ఆమోదించారు. రాజ్యసభ నుంచి కొత్త సభ్యుడికి కూడా ఈ కమిటీలో స్థానం కల్పించినట్లు లోక్‌సభ సెక్రటరీ జనరల్ సభకు తెలిపారు. వైసిపికి చెందిన రాజ్యసభ సభ్యుడు విజయ సాయిరెడ్డి రాజీనామా చేయడంతో 39 మంది సభ్యుల కమిటీలో ఓ పోస్టు ఖాళీ కావడంతో కొత్తగా సభ్యుడికి చోటు కల్పించారు.

అలహాబాద్ న్యాయవాదుల నిరవధిక సమ్మె

- జస్టిస్ వర్మ బదిలీని నిరసిస్తూ ఆందోళన

అలహాబాద్ : ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను ప్రయాగరాజ్‌లోని అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు నిర్ణయించడంపై స్థానిక బార్ అసోసియేషన్ మండిపడింది. ప్రతిపాదిత బదిలీని వ్యతిరేకిస్తూ మంగళవారం నిరవధిక సమ్మెను ప్రారంభించింది. న్యాయవాదులు హైకోర్టు మూడవ నెంబరు గేటు వద్ద ఆందోళనకు దిగారు.

ఈ సందర్భంగా అలహా బాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ విలేకరులతో మాట్లాడుతూ తమ నిరసన ఏ కోర్టుకు లేదా ఏ జడ్జికి వ్యతిరేకం కాదని చెప్పారు. న్యాయ వ్యవస్థకు ద్రోహం చేసిన వారికి వ్యతిరేకంగానే తాము ఆందోళన చేస్తున్నామని అన్నారు. సుప్రీంకోర్టు నిరంకుశత్వాన్ని నిలువరించాలని కోరారు. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయడాన్ని అనుమతించవద్దని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

'మా పోరాటం అవినీతికి పాల్పడిన వారి పైనే. పారదర్శకత లోపించిన వ్యవస్థ పైనే. బదిలీ ఆదేశాన్ని పునఃపరిశీలించి ఉపసంహరించుకోవాలన్నదే మా డిమాండ్' అని అనిల్ తివారీ స్పష్టం చేశారు. జస్టిస్ వర్మ బదిలీని వ్యతిరేకిస్తున్నట్లు బార్ అసోసియేషన్ సోమవారం నాడే పునరుద్ఘాటించింది. దీనిని ఆపకుంటే మంగళవారం నుండి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించింది. 'ప్రారంభం నుండి ఈ వ్యవహారాన్ని మసిపూసి మారేడుకాయ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ రోజు దేశవ్యాప్తంగా న్యాయవాదులు పోరాటం చేస్తున్నారు. పరిష్కారం సాధించే వరకూ విధులకు హాజరు కాబోము. ఏం జరిగినా సరే' అని తివారీ చెప్పారు. జస్టిస్ వర్మను బదిలీ చేయాలని గతంలో చేసిన సిఫార్సును సుప్రీంకోర్టు ధ్రువీకరించిన విషయం తెలిసిందే. కేంద్రానికి పంపిన బదిలీ సిఫారసును సుప్రీంకోర్టు వెబ్‌సైటులో అప్‌లోడ్ చేశారు.

వెనిజులాపై ట్రంప్ కన్నెర్ర

- ఆ దేశం నుంచి చమురు, గ్యాస్ కొంటే 25 శాతం సుంకాలు
- భారత్‌పై ప్రభావం పడుతుందంటున్న నిపుణులు

వాషింగ్టన్ : వెనిజులాపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కన్నెర్ర చేశారు. ఆ దేశం నుంచి చమురు, గ్యాస్ దిగుమతి చేసుకునే ఏ దేశం పైన అయినా సరే ఇరవై ఐదు శాతం సుంకం విధిస్తానని ప్రకటించారు. అమెరికా శత్రు దేశాలతో పాటు మిత్ర దేశాలపై కూడా ట్రంప్ వాణిజ్య యుద్ధాన్ని ముమ్మరం చేసిన విషయం తెలిసిందే. 'అమెరికా పట్ల వెనిజులా చాలా శతృత్వ ధోరణితో వ్యవహరిస్తోంది. కాబట్టి ఆ దేశం నుండి చమురు లేదా గ్యాస్ కొనుగోలు చేసే ఏ దేశమైనా అమెరికాతో వాణిజ్యం నెరిపితే ఇరవై ఐదు శాతం సుంకం చెల్లించాల్సిందే' అని ట్రూత్ సోషల్ నెట్‌వర్క్‌లో ట్రంప్ స్పష్టం చేశారు.

ట్రంప్ హెచ్చరికలు భారత్‌పై ప్రభావం చూపుతాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడ్డారు. 2023 డిసెంబరులోనూ, 2024 జనవరిలోనూ వెనిజులా నుండి ముడి చమురు కొనుగోలు చేసిన దేశాలలో భారత్‌దే మొదటి స్థానం. ఆ దేశం నుండి భారత్ 22 మిలియన్ బ్యారల్స్ చమురును దిగుమతి చేసుకుంది. మన దేశం కొనుగోలు చేస్తున్న మొత్తం ముడి చమురులో ఇది ఒకటిన్నర శాతం. 2023 డిసెంబరులో భారత్ రోజుకు సుమారు 1,91,600 బ్యారల్స్ చమురును దిగుమతి చేసుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ రోజుకు 1,27,000 బ్యారల్స్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) 37,000 బ్యారల్స్, హెచ్‌పీసీఎల్-మిట్టల్ ఎనర్జీ 28,000 బ్యారల్స్ దిగుమతి చేసుకున్నాయి. గత సంవత్సరం జనవరిలో భారత్ దిగుమతులు రోజుకు 2,54,000 బ్యారల్స్‌కు పెరిగాయి. వెనిజులా చేసిన మొత్తం ఎగుమతులలో ఇది దాదాపు సగం.

ట్రూత్ సోషల్ వేదికలో ట్రంప్ నూతన టారిఫ్‌ను ప్రకటిస్తూ 'అధ్యక్షుడు డొనాల్డ్ జే ట్రంప్ ఈ రోజు ఓ ప్రకటన చేస్తున్నారు. వెనిజులాపై అమెరికా రెండో దఫా టారిఫ్‌ను విధిస్తోంది. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. వెనిజులా ఉద్దేశపూర్వకంగా, మోసపూరితంగా వేలాది మంది నేరస్థులను రహస్యంగా అమెరికాకు పంపుతోంది. వీరిలో చాలా మంది హంతకులు. వారు హింసాత్మక స్వభావం కలిగిన వారు. అమెరికాకు వెనిజులా పంపుతున్న ముఠాలలో ట్రెన్ డీ అరాగువా ఒకటి. అది ఓ విదేశీ ఉగ్రవాద సంస్థ. వారిని వెనిజులాకు తిప్పి పంపే ప్రయత్నంలో ఉన్నాం. అది చాలా పెద్ద పని. పైగా అమెరికా విషయంలో వెనిజులా శత్రుభావంతో వ్యవహరిస్తోంది' అని ఆరోపించారు. కాబట్టి వెనిజులా నుండి చమురు లేదా గ్యాస్ కొనుగోలు చేసే ఏ దేశమైనా అమెరికాతో వాణిజ్యం కొనసాగించాలంటే ఇరవై ఐదు శాతం సుంకాన్ని విధిగా చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. డాక్యుమెంటేషన్ ప్రక్రియను పూర్తి చేసి వచ్చే నెల 2వ తేదీ నుండి సుంకాలు విధిస్తామని పునరుద్ఘాటించారు. ఆ రోజు అమెరికాలో విముక్తి దినోత్సవాన్ని జరుపుకుంటామని ట్రంప్ చెప్పుకొచ్చారు.

గాజాలో కొనసాగుతున్న మారణ హోమం

- తాజా దాడుల్లో ఏడుగురు చిన్నారులతో సహా 23మంది మృతి
- 9మంది సహాయ కార్యకర్తల గల్లంతు
- ఆస్కార్ అవార్డు గ్రహీత నిర్మాతపై దాడి

గాజా : వరుసగా 8వ రోజు కూడా గాజాపై ఇజ్రాయిల్ బలగాలు బాంబు దాడులకు తెగబడుతున్నాయి. మంగళవారం నాటి దాడుల్లో 23మంది మరణించగా, వీరిలో ఏడుగురు చిన్నారులు వున్నారు. గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న ఈ మారణహోమంలో ప్రస్తుత కాలం చిన్నారులకు ప్రాణసంకటంగా మారింది. గత వారం రోజుల్లో జరిపిన దాడుల్లో 270మందికి పైగా చిన్నారులు మరణించారని సేవ్ ది చిల్డ్రన్ సంస్థ వెల్లడించింది. ఉత్తర గాజాలోని సరిహద్దు ప్రాంత పట్టణాల్లో నివసిస్తున్న వేలాదిమంది పాలస్తీనియన్లందరినీ కూడా అక్కడ నుండి ఖాళీ చేయాల్సిందిగా ఇజ్రాయిల్ మిలటరీ ఆదేశించింది. ఆ ప్రాంతం నుండే పాలస్తీనా రాకెట్లు ప్రయోగిస్తున్నారని విమర్శించింది. మరోవైపు ఇజ్రాయిల్ సాగిస్తున్న దారుణమైన ఊచకోతలను హమాస్ తీవ్రంగా ఖండించింది. తక్షణమే ఇజ్రాయిల్‌కు పగ్గాలు వేయాల్సిందిగా అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. వరుసగా మూడో రోజూ పాలస్తీనా రెడ్ క్రీసెంట్ సొసైటీకి చెందిన 9మంది గల్లంతయ్యారు. రఫా నగరంలో సహాయ కార్యకలాపాలకు వెళ్ళినవీరు వెనక్కి తిరిగి రాలేదు.

సెటిలర్లపై దాడులు జరిగిన నేపథ్యంలో ఇజ్రాయిల్ ఆర్మీ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఆస్కార్ అవార్డు గ్రహీత నిర్మాత, కో డైరెక్టర్ అయిన హమ్‌దాన్ బల్లాల్‌ను ఇజ్రాయిల్ అదుపులోకి తీసుకుంది. సుశియా గ్రామంలో యూదు సెటిలర్లు ఆయనపై దాడి చేశారు. వెంటనే సైనికులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. నో అదర్ ల్యాండ్ పేరుతో ఆయన తీసిన డాక్యుమెంటరీ అస్కార్ పురస్కారాన్ని గెలుచుకుంది. ఆయన అరెస్టు వార్తపై ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. అయితే బల్లాల్‌ను ఆయనతో పాటు అదుపులోకి తీసుకున్న మరో ఇద్దరు పాలస్తీనియన్లను వుంచిన కిర్యాత్ అర్బా సెటిల్‌మెంట్ ఏరియాలో పోలీసు స్టేషన్ నుండి వారు బయటకు వస్తూ కనిపించారని మీడియా వార్తలు తెలిపాయి. బల్లాల్ ముఖంపై గాయాలున్నాయని, ఆయన దుస్తులపై రక్తం మరకలు వున్నాయని ఎపి వార్తా సంస్థ వెల్లడించింది.

బందీలను అప్పగించకపోతే హమాస్ భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ హెచ్చరించారు. ఇదే పరిస్థితి ఇలాగే కొనసాగితే, మొత్తంగా గాజా ప్రాంతాన్ని హస్తగతం చేసుకుంటామని, హమాస్‌ను పూర్తిగా ఓడించేవరకు పోరాటం చేస్తామని ప్రకటించారు. ముందుకుగా కిడ్నాప్‌కు గురైన వారందరూ ఇళ్ళకు చేరాలన్నదే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు.

ప్రాంతీయ ఉద్రిక్తతలు పెంచిన త్రైపాక్షిక విన్యాసాలు

- అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ తీరుపై ఉత్తర కొరియా ఆగ్రహం

సియోల్ : అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ ఇటీవల నిర్వహించిన త్రైపాక్షిక నావికా విన్యాసాలు ఈ ప్రాంతంలో ఇప్పటికే తీవ్రంగా వున్న రాజకీయ, మిలటరీ పరిస్థితులను మరింత ఉధృతం చేయడానికేనని ఉత్తరకొరియా తప్పుబట్టింది. ఈ విన్యాసాల తదనతరం ప్రాంతీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయని ఉత్తరకొరియా అధికార వార్తా సంస్థ కెసిఎన్ఎ వ్యాఖ్యానించింది. మార్చి 10 నుండి 20 వరకు అమెరికా, దక్షిణ కొరియాలు ఫ్రీడమ్ షీల్డ్ మిలటరీ విన్యాసాలను నిర్వహించాయి.

అదే సమయంలో మార్చి 17 నుండి 20 వరకు అమెరికా, జపాన్, దక్షిణ కొరియాలు జేజు దీవిలో సముద్ర జలాల్లో నావికా విన్యాసాలు నిర్వహించాయి. మూడు దేశాలకు చెందిన యుద్ధ నౌకలు ఇందులో పాల్గొన్నాయి. అణు శక్తితో నడిచే అమెరికా విమాన వాహక నౌక యుఎస్ఎస్ కార్ల్ విన్సన్ కూడా పాల్గొంది. ఈ ప్రాంతంలోని సార్వభౌమ దేశాల సాధారణ సముద్ర రవాణాను కూడా బలవంతంగా అడ్డుకోవాలన్నది వారి నీచపు ఆలోచనగా వుందని ఈ విన్యాసాలతో వెల్లడవుతోందని కెసిఎన్ఎ తన వ్యాఖ్యానంలో పేర్కొంది. ఉత్తర కొరియా పట్ల ప్రస్తుత అమెరికా ప్రభుత్వం ఘర్షణాయుత వైఖరిని అవలంబిస్తోందని పేర్కొంది. తమ జాతీయ భద్రతను పరిరక్షించుకోవడానికి, ప్రాంతీయ శాంతి కోసం ఉత్తర కొరియా తన ప్రయత్నాలను మరింత పెంచుతుందని పేర్కొంది. ఉత్తర కొరియా భద్రతా వలయంలో అమెరికా సిద్ధాంతాలు పనిచేయవని వ్యాఖ్యానించింది. శత్రు దేశాల నుండి ఎలాంటి కవ్వింపు చర్యలు ఎదురైనా వాటికి తగిన ప్రతిస్పందన తమ వైపు నుండి వుంటుందని స్పష్టం చేసింది.

యుపి ప్రభుత్వ అక్రమ కూల్చివేతలపై సుప్రీంకోర్టు దిగ్భ్రాంతి

- సహజ న్యాయ సూత్రాలను గౌరవించాలని హితవు

న్యూఢిల్లీ : 2021లో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో నోటీసు ఇచ్చిన ఒక రోజు వ్యవధిలోనే ఓ న్యాయవాది, ఓ ప్రొఫెసర్, మరో ముగ్గురి నివాస గృహాలను రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేయడంపై సుప్రీంకోర్టు దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. 'నోటీసు ఇచ్చిన 24 గంటల లోపే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన చర్య న్యాయస్థానం మనస్సాక్షిని కలచివేసింది' అని న్యాయమూర్తులు అభయ్ ఎస్ ఓకా, ఉజ్జల్ భూయాన్‌తో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. కేసులో తీర్పు వెలువరించిన తర్వాత కూల్చివేసిన ఇళ్లను పునర్నిర్మించాల్సిందిగా అధికారులను ఆదేశిస్తామని తెలిపింది. 'ఇలాంటి చర్యలను సహించబోమని మీకు చెబుతున్నాం' అంటూ తీవ్రంగా స్పందించింది. సహజ న్యాయ సూత్రాల పట్ల ప్రభుత్వానికి కనీస గౌరవం ఉండాలని హితవు పలికింది.

న్యాయవాది జుల్ఫికర్ హైదర్, ప్రొఫెసర్ అలీ అహ్మద్, ఇద్దరు వితంతువులు, మరో వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారిస్తోంది. తమ నివాస గృహాలను కూల్చివేయడాన్ని సవాలు చేస్తూ వారు దాఖలు చేసిన పిటిషన్‌ను గతంలో అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. దీంతో వారు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తమ భూమిని రాష్ట్ర ప్రభుత్వం గ్యాంగ్‌స్టర్-రాజకీయ నేత అయిన అతిక్ అహ్మద్‌తో ముడిపెట్టడం సరికాదని వారు వాదించారు. అహ్మద్ 2023 ఏప్రిల్‌లో హత్యకు గురయ్యారు. 2021 మార్చిలో ఒక రోజు బాగా పొద్దుపోయిన తర్వాత అధికారులు తమకు కూల్చివేత నోటీసులు ఇచ్చారని, వీటిని న్యాయస్థానంలో సవాలు చేసేందుకు ఏ మాత్రం సమయం ఇవ్వకుండా ఆ మరునాడే కూల్చేశారని పిటిషనర్లు తెలియజేశారు. భూమిని లీజుకు తీసుకున్నామని, దానిపై యాజమాన్య హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్నామని వివరించారు. అయితే పిటిషనర్లకు చట్టపరంగా ఎలాంటి హక్కులు లేవని, వారు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వాదించింది.

కూల్చివేతలకు సంబంధించి పిటిషనర్లకు చాలా ముందుగానే మూడుసార్లు నోటీసులు అందజేశామని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి కోర్టుకు తెలియజేశారు. పిటిషనర్లు ఇళ్లు కోల్పోలేదని, వారు అక్కడ నివసించడం లేదని తెలిపారు. అయితే నోటీసులను పిటిషనర్లకు స్వయంగా అందజేయలేదని, వారి ఆస్తుల మీద అతికించారని, కేవలం తుది నోటీసును మాత్రమే పోస్టులో పంపారని సుప్రీంకోర్టు ప్రస్తావించింది. 'మీరు అనుకున్నప్పుడే పోస్టులో పంపుతారు. ఇది ఒక ఎత్తుగడ' అని వ్యాఖ్యానించింది. అక్రమ నిర్మాణాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులకు సుప్రీం బెంచ్ సూచించింది. చట్ట ప్రకారం ముందుకు సాగాల్సి ఉంటుందని గుర్తు చేసింది. ఈ నెల ఐదవ తేదీన విచారణ జరిపిన సందర్భంలో కూడా యూపీ ప్రభుత్వాన్ని న్యాయస్థానం తప్పుపట్టింది. ఇలాంటి చర్యలు దిగ్భ్రాంతి కలిగిస్తాయని, తప్పుడు సంకేతాలు పంపుతాయని చెప్పింది.

బుజ్జగింపు బహుమతులు !

- మూడు మతాల్లో 32 లక్షల మందికి పండుగ నజరానాలు!
- వక్ఫ్ బిల్లుపై ఆగ్రహాన్ని అణచివేసేందుకు బిజెపి పన్నాగాలు

న్యూఢిల్లీ : ముసింలు, సిక్కులు, క్రైస్తవ కమ్యూనిటీల కోసం బిజెపి పెద్ద ఎత్తున పండుగ నజరానాలు అందిస్తోంది. 'సౌగత్-ఇ-మోడీ' (ప్రధాని మోడీ నుండి బహుమతులు) గా పిలిచే ఈ ఫెస్టివ్ కిట్‌లను ఈద్, వైశాఖి, ఈస్టర్ పండుగల సందర్భంగా వారికి అందించాలని భావిస్తోంది. వరుసగా మూడు వారాల్లో మూడు పండుగలు రావడంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు బిజెపి మైనారిటీ మోర్చా చీఫ్ జమాల్ సిద్ధిఖి చెప్పారు. మార్చి చివరిలో ఈద్ రాగా, ఏప్రిల్ 14న వైశాఖి, 20న ఈస్టర్ పండుగలు వచ్చాయి.

32 లక్షల మందికి కిట్‌లు

ఈ కిట్‌ల్లో డ్రై ఫ్రూట్స్, శనగపిండి, బొంబాయి రవ్వ, సేమ్యా, చక్కెర, సల్వార్ కమీజ్ సెట్ వుంటుంది. వీటిని మూడు మతాలకు చెందిన 32లక్షల మందికి పంచిబెడతారు. దీనికోసం దేశవ్యాప్తంగా 32వేల మంది వలంటీర్లు వున్నారని సిద్ధిఖి చెప్పారు. ఒక్కో వలంటీరు ఒక్కో మతానికి చెందిన వంద కుటుంబాలను కలిసి ఈ కిట్‌లను అందచేయాల్సి వుంటుంది. ఈ కుటుంబాలను సంప్రదించడానికి వలంటీర్లకు ఏదైనా సమస్య ఎదురైతే వారు ఆయా ప్రాంతాల్లోని మసీదు, గురుద్వారా లేదా చర్చితో సమన్వయం చేసుకోవాల్సి వుంటుందని సిద్ధిఖి చెప్పారు.

అయితే వక్ఫ్ సవరణ బిల్లుపై ముస్లిం కమ్యూనిటీ నుండి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో వారిని బుజ్జగించేందుకు బిజెపి చేసిన ప్లాన్‌గా ఇది వుందని విమర్శలు వస్తున్నాయి. ఈ బిల్లు కారణంగానే బీహార్ ముఖ్యమంత్రి, బిజెపి మిత్రుడు నితీష్ కుమార్ ఇచ్చిన ఇఫ్తార్ విందును ప్రధాన ముస్లిం సంఘాలైన అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు, జమైత్ ఉలేమా ఇ హింద్ సహా పలు సంఘాలు బహిష్కరించాయి. మైనారిటీల హక్కులను పరిరక్షిస్తామని, సెక్యులర్ ప్రభుత్వాన్ని అందిస్తామన్న హామీలతోనే నితీష్ అధికారంలోకి వచ్చారని, కానీ బిజెపితో పొత్తు, రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ సవరణ బిల్లుకు ఇచ్చిన మద్దతు కారణంగా నితీష్ ఇచ్చిన హామీలు దారుణంగా ఉల్లంఘించబడ్డాయని ఇ సంఘాలు విమర్శించాయి. ఈ మేరకు ఆయా సంఘాలు ముఖ్యమంత్రికి ఒక లేఖ రాశాయి. ఈ ఏడాది చివరిలోనే బీహార్‌లో ఎన్నికలు జరగాల్సి వుంది.

వక్ఫ్ బిల్లుకు లేదా బీహార్ ఎన్నికలకు ఈ కిట్‌ల పంపిణీకి ఎలాంటి సంబంధం లేదంటూ సిద్ధిఖి తోసిపుచ్చారు. దేశంలో ఏదో ఒక చోట ప్రతీ ఏడాది ఎన్నికలు జరుగుతునే వుంటాయి. అలా అయితే మనం ఇక మంచి పనులే చేయకూడదనా అర్థం? అని ఆయన ప్రశ్నించారు. ఈ కిట్‌ల పంపిణీ కార్యక్రమానికి ఎంత మొత్తం కేటాయించారని ప్రశ్నించగా, బహుమతులనేవి అమూల్యమైనవని, వాటికి వెల కట్టలేమని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ ఊర్లో బతకలేం..

(మొదటి పేజీ తరువాయి)

ఉంది. స్వయంభూవరం, సోమినాయుడుపాలెం గ్రామాల్లో సమస్య తీవ్రంగా ఉంది. స్వయంభూవరంలో నడి వయస్సులోని వారూ కిడ్నీ, చర్మ వ్యాధులు, కీళ్ల, కండరాల నొప్పులు, శ్వాస, తెల్లటి మచ్చల సమస్యలతో బాధపడుతున్నారు. ఎన్‌టిపిసి నుంచి నల్లటి దుమ్ము, తేమలాంటి ఉప్పు నీరు పొరపొరలుగా ఇళ్లపై పడుతోంది. స్లాబ్‌లు తొందరగా బద్ధలవుతున్నాయి. ఇంటి గేట్లు, గ్రిల్స్ తుప్పు పడుతున్నాయి. మూడు కిలోమీటర్ల దూరంలోని వెన్నెలపాలెం నుంచి తాగునీటిని కొని తెచ్చుకుంటున్నామని, బోర్ల నుంచి వస్తున్న ఉప్పు నీటిని ఇతర అవసరాలకు వాడుకుంటున్నామని స్థానిక మహిళలు చెప్పారు. ఉప్పు నీటి తేమ విద్యుత్ వైర్లపై పడుతుండడంపై విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతోందని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని పచ్చని చెట్లు కాలిపోయినట్లు మాడిపోతున్నాయి. కాలుష్య ప్రభావం వల్ల పంటలు పండక ఉన్న కొద్దిపాటి భూములనూ ఖాళీగా వదిలేశారు. కూలింగ్ టవర్ వాటర్ పడడంతో కొబ్బరి పిందెలు రాలిపోతున్నాయి. పచ్చగడ్డి లేక కొనుక్కొని దాచుకున్న ఎండుగడ్డిని ప్రతిరోజూ కడిగి పశువులకు వేస్తున్నామని బొండా పార్వతి వాపోయారు. సరైన మేత లేక పశువులు బక్కచిక్కిపోతున్నాయని తెలిపారు. గ్రామంలో నీలగిరి మొక్కలు మాడిపోయాయి. సరుగుడు మొక్కలపై నల్లటి దుమ్ము పేరుకుపోయింది. ఆ గ్రామాలను వేరే చోటుకు తరలిస్తామని ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు.

అనారోగ్య సమస్యలు తీవ్రం

40 ఏళ్ల బొండా నాగమణి నరాలు, కండరాల బలహీనతతో బాధపడుతున్నారు. ఆమె కాళ్లు, చేతులు పనిచేయడం లేదు. వైద్యం చేసుకొనే ఆర్థిక స్థోమతలేక ఆ బాధను భరిస్తూ బతుకుతున్నారు. ఆమె బంధువులు కాలపురెడ్డి రాంబాబు, కాలపురెడ్డి కొండబాబు, కాలపురెడ్డి రామినాయుడు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. వ్యవసాయ పనులు చేసుకొనే కాలపురెడ్డి తాతబాబుకు రెండు కాళ్లూ వంకరయ్యాయి. నడవలేక మంచంపై ఉన్నారు. ఆయన మూడెకరాల భూమి ఎన్‌టిపిసి ఏర్పాటులో పోయింది.

తరలింపు చర్యలు చేపట్టాలి

స్వయంభూవరం, సోమినాయుడుపాలెం గ్రామాలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. కాలుష్యంతో అక్కడి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ప్రస్తుత ధరల ప్రకారం ఇళ్లకు రేటు చెల్లించాలి. కుటుంబానికి ఐదు సెంట్లు కేటాయించి ఇళ్ల నిర్మాణానికి డబ్బులు ఇవ్వాలి. మేజర్లకు ప్యాకేజీ చెల్లించాలి.

-గనిశెట్టి సత్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

పాస్టర్ అనుమానాస్పద మృతి

(మొదటి పేజీ తరువాయి)

క్రైస్తవ సంఘాలు, దళిత సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. ఆయన మృతదేహాన్ని హోసన్న మినిస్ట్రీ నిర్వాహకులు జాన్ వెస్లీ, యంగ్ హోలీ టీమ్ నిర్వాహకులు జాన్ వెస్లీ, విజయకుమార్ రెడ్డి, మాజీ ఎంపి జివి.హర్షకుమార్, మహాసేన రాజేష్, దళిత నాయకులు అజ్జరపు వాసు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ప్రవీణ్ మృతిపై అనుమానాల నేపథ్యంలో నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి, వాస్తవాలను వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

మీకోసం

మొక్కజొన్న పొత్తులను ఉడికించే నీటితో కొద్దిగా పంచదార వేస్తే చాలా రుచిగా ఉంటాయి.

జీవన సౌరభం

మన స్థాయిని పెంచేది మన ప్రవర్తన తప్ప ఎదుటి వారి పొగడ్త కాదు.

బాధ్యతల్లోనే కాదు.. ఆటల్లోనూ రాణిస్తాం...

ఒకటే గమనం ఒకటే గమ్యం
గెలుపు పొందే వరకూ అలుపు లేదు మనకు
బ్రతుకు అంటే గెలుపూ గెలుపు కొరకే బ్రతుకు....

అంటూ సాగే ఈ పాట 'భద్రాచలం' సినిమాలోనిది. సుద్దాల అశోక్‌తేజ అందించిన సాహిత్యానికి ప్రతిరూపమే మనం మాట్లాడుకునేది. పట్టుదలతో ఏ పనిచేసినా అందులో రాణించొచ్చుననే సందేశం ఈ పాటలోని స్ఫూర్తి. ఇది ఈ ఇద్దరి మహిళా అధికారులైన మద్దా బేబి సరోజని, సహదేవ సత్యవతిలకు అచ్చంగా సరిపోతుంది. ఓ వైపు రాష్ట్ర స్థాయిలో కీలకమైన బాధ్యతల్లో విధులు నిర్వహిస్తూ మరో వైపు క్రీడారంగంలో రాణిస్తూ మంచి పేరు ప్రఖ్యాతులు గడిస్తున్నారు. ఐదు పదుల వయస్సుల్లోనూ క్రీడల్లో దూసుకు పోతూ నేటి యువతరానికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు.

అమరావతి రాజధాని వెలగపూడిలోని సచివాలయంలో మద్దా బేబి సరోజని మైనార్టీస్ విభాగంలో అసిస్టెంట్ సెక్రటరీగానూ, సహదేవ సత్యవతి జనరల్ అడ్మినిస్ట్రేషన్ (జిఎడి) విభాగంలో సెక్షన్ ఆఫీసర్లుగా కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈనెల 16 నుంచి 20 వరకూ న్యూఢిల్లీలోని త్యాగరాజ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆలిండియా సివిల్ సర్వీసెస్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో వీరిద్దరి జంట మహిళల డబుల్స్ వెటరన్ విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్లో మహారాష్ట్ర జట్టును 3–0తో ఓడించింది. వ్యక్తిగత విభాగంలో మద్దా బేబి సరోజిని రెండు కాంస్య పతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయం తరపున పతకాలు సాధించిన ఘనత వీరికే దక్కింది.

గతంలోనూ విజయాలు

2018లో సెప్టెంబర్ 24 నుంచి 29వ తేదీ వరకూ ఢిల్లీలో జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ టెన్నిస్ టోర్నమెంట్‌లోనూ వీరిద్దరూ పాల్గొని మధ్యప్రదేశ్ క్రీడాకారులపై 3–0 తేడాతో గెలిచి బంగారు పతకాలు సాధించారు. 2018 హర్యానా పంచకూల్‌లో, 2020 పూణేలో నిర్వహించిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో బంగారు, వెండి పతకాలు సాధించారు. ఎం.బేబీసరోజిని వ్యక్తిగత విభాగంలో 2018లో బ్రాంజ్‌మెడల్ సాధించారు. ఇప్పటివరకూ ఎపి సచివాలయం తరపున టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొని బంగారు, వెండి కాంస్య పతకాలు సాధించిన ఘనత వీరికే దక్కింది. ఇప్పటివరకూ వ్యక్తిగతంగా బేబీసరోజిని మొత్తం 8 పతకాలను కైవసం చేసుకున్నారు. 2018లో కాంస్యం 1, బంగారం 1, 2019లో డబుల్స్‌లో బంగారం, 2020, 2021, 2022లో డబుల్స్‌లో సిల్వర్, 2024లో డబుల్స్‌లో కాంస్య పతకాన్ని అందుకున్నారు. పట్టుదలతో ఎవ్వరి కోచింగ్ లేకుండా, వారంతట వారే మెళకువలు నేర్చుకుని ఇతరుల ఆటలను గమనిస్తూ ప్రావీణ్యాన్ని సాధించారు. మనదేశంలోనే కాకుండా బ్రెజిల్, చైనా, స్వీడన్ దేశాల్లో జరిగిన వెటరన్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొనటమే కాకుండా అత్యంత మెరుగైన ప్రతిభ కనబర్చారు.

కుటుంబాల నుంచి ప్రోత్సాహం

పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన మద్దా వెంకటేశ్వరరావు, మేరీ విజయకుమారిల దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వారిలో మూడో సంతానంగా బేబీ సరోజిని. ప్రాథమిక విద్యను కైకరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్తిచేశారు. ఇంటర్, డిగ్రీని ఏలూరులోని సెయింట్ థెరిస్సా, సెయింట్ ఆన్స్ కళాశాలల్లో పూర్తిచేశారు. కుమారుడు విజయ్ ఎస్‌బిఐలోనూ, కుమార్తె యుఎస్‌ఎలో ఉద్యోగాల్లో ఉన్నారు. సరోజిని ఇంటర్మీడియట్‌బోర్డులో మొదటిగా పనిచేశారు. ఆ తర్వాత గ్రూప్ 2 ద్వారా హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో ఉద్యోగాన్ని సాధించారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోని వెలగపూడి సచివాలయ అధికారిగా వచ్చారు. బేబీసరోజిని భర్త ధర్మారావు స్కూల్ ఎడ్యుకేషన్‌లో డిప్యూటీ సెక్రటరీగా పనిచేసి 2024లో జులైలో ఉద్యోగ విరమణ పొందారు. ఆయన కూడా చదువుకునే రోజుల్లో బాల్‌బ్యాడ్మింటెన్‌లో పతకాలు పొందారు. అధికారిగా పనిచేసిన రోజుల్లో కూడా టిటి నేర్చుకుని వెటరన్ ఆడేవారు. తన భర్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో బేబీ సరోజిని వెటరన్ క్రీడాకారిణిగా రాణిస్తున్నారు. ఆమె పతకాలు సాధించినప్పుడల్లా తల్లిదండ్రులు, సోదరులు కుమార్‌శేఖర్, రాజారత్నం, సోదరి స్వర్ణలత ఎంతో సంతోషపడేవారు.

ఏలూరులో ఓ మధ్యతరగతి కుటుంబంలో సహదేవ సుధాకరరావు, భారతి దంపతులకు మొదటి సంతానంగా సత్యవతి జన్మించారు. డిగ్రీ పూర్తయిన తర్వాత పోలీసు డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న రాయుడు శివశంకరవరప్రసాద్‌తో వివాహమైంది. ఆయన ప్రోత్సాహంతో ఎపిపిఎస్‌సి గ్రూప్ 2బి పరీక్ష రాసి 1996లో అప్పటి ఎపి సెక్రటేరియట్‌లో టైపిస్ట్ కమ్ అసిస్టెంట్‌గా ఉద్యోగ బాధ్యతల్లో చేరారు. అదే బ్యాచ్‌లో బేబీ సరోజిని ఉద్యోగంలో చేరారు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య స్నేహం కుదిరింది. ఇరు కుటుంబాలు ఎంతో అన్యోన్యంగా ఉంటున్నాయి. 2002లో ఎఎస్‌ఒ (అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్)గా ఉద్యోగోన్నతి వచ్చిన తర్వాత వీరు ఒక రోజు సరదాగా ప్రారంభించిన టేబుల్ టెన్నిస్ ఆటతో వీరు అద్భుతమైన ప్రతిభను కనబరుస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం 2014 నుంచి 2018 వరకూ రాజ్‌భవన్‌లో గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్ హయాంలో విధులు నిర్వహించారు. ఆమె పెద్ద కుమారుడు, కోడలు బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. చిన్న కుమారుడు ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారు.

స్నేహమేరా జీవితం..

ఇంటర్ దగ్గర నుంచి డిగ్రీ వరకూ వీరిద్దరూ ఒకే కళాశాలలో చదువుకున్నారు. వీరిద్దరూ ఉద్యోగ రీత్యా మంచి స్నేహితురాళ్లు. వీరు సరదాగా 2005 నుంచి టేబుల్ టెన్నిస్‌ను ఆడటం ప్రాక్టీస్ చేశారు. అప్పటి నుంచి రోజూ ఆడుతూనే ఉన్నారు. ఈ ఆటలో మంచి ప్రావీణ్యాన్ని సంపాదించారు. వెటరన్ టేబుల్ టెన్నిస్ క్రీడలు ఎక్కడ జరిగినా అక్కడికి వెళ్లి పోటీల్లో పాల్గొనేవారు. ఇద్దరి కుటుంబ సభ్యుల నుంచి ప్రోత్సాహం కూడా ఉండటంతో వారు తమ ఉద్యోగం, కుటుంబ వ్యవహారాలకు ఏ మాత్రం ఇబ్బందికల్గకుండా తీరిక సమయాల్లో టిటిని, పోటీలు పెట్టినప్పుడు వాటిలో పాల్గొనటం చేస్తున్నారు. తద్వారా వారిలో బాగా ఆత్మ విశ్వాసం పెరిగింది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో కూడా పాల్గొనటం ద్వారా బంగారు, వెండి పతకాలను సైతం కైవసం చేసుకుంటున్నారు. వీరిద్దరికీ మనుమరాళ్లు కూడా ఉన్నారు.

ఉద్యోగ ధర్మం నిర్వర్తిస్తూనే...

జిఎడిలో మద్దా బేబి సరోజిని–సహదేవ సత్యవతి ఇద్దరు కీలక అధికారులే. మంత్రి వర్గ సమావేశాలు ఉన్నా, ఇతరత్రా శాఖల వారీగా సమావేశాలు ఉంటే వీరిద్దరూ అర్ధరాత్రి 1 గంట పైబడి వేచివుండి పనిచేయాల్సివస్తుంది. ఇలాంటి సందర్భాల్లో వారేమీ ఎలాంటి ఒత్తిడిని ఫీలవ్వరు. బాధ్యతగా తమ విధులను నిర్వహిస్తారు. ఆయా సమావేశాలకు అవసరమైన ఫైళ్ళను, ఇతర రిపోర్టులు ఎంచక్కా తయారుచేసి అందజేస్తుంటారు. ఏ పని అప్పగించినా బాధ్యతగా చేస్తారు. ఉద్యోగ బాధ్యతల్లో కీలకంగా ఉంటూ క్రీడల్లో రాణిస్తున్న వీరిద్దరిని పలువురు ప్రశంసిస్తున్నారు.

సిఎం, సిఎస్ అభినందనలు

బేబీ సరోజిని–సత్యవతి జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్ పేరుప్రఖ్యాతులు నిలిపారని సిఎం నారా చంద్రబాబునాయుడు, సిఎస్ విజయానంద్ తదితరులు సైతం అభినందించారు. నైపుణ్యమైన క్రీడాకారుల నుంచి పోటీని తట్టుకుని విజయకేతనం ఎగరేయటం మంచి శుభపరిణామమని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి క్రీడల్లో ప్రవేశం ఉండి, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందిన వారితో పోరాడి గెలుపొందటం అంత ఆషామాషీ విషయం కాదని తెలిపారు.

–యడవల్లి శ్రీనివాసరావు

చదువు కోరిక

ఒక ఊరిలో రాంబాబు కుటుంబం ఉండేది. అతని భార్య పేరు లక్ష్మి. వారికి ఇద్దరు కొడుకులు, కూతురు సౌమ్య ఉన్నారు. ఇద్దరు కొడుకులను పదవ తరగతి పైన చదివించారు. కూతురిని మాత్రం పదవ తరగతి వరకే చదివించారు. ఒక రోజు సౌమ్య తండ్రి దగ్గరికి వెళ్లి 'నేను ఇంకా చదువుకుంటా నాన్న' అని అడిగింది అయితే వాళ్ల నాన్న 'నువ్వు ఆడపిల్లవి నీకు చదువు ఎందుకు? వద్దు. చదవడం ఆపేసి ఇంటి పని చెయ్యి చాలు' అని తిట్టాడు.

నాన్న అలా అనేసరికి సౌమ్యకి దు:ఖం ఆగలేదు. అయినా ఏం చేయలేక ఇంటిదగ్గరే ఉండిపోయింది. అప్పటినుండి ప్రొద్దున్నే ఇంటి పనులు చేసి దగ్గర్లో ఉన్న మిషన్ కొట్టులో బట్టలు కుట్టడం నేర్చుకుంది. తనకు లాగే అక్కడ కొంతమంది అమ్మాయిలు ఉండడం సౌమ్య గమనించింది. వారందరూ కూడా చదువు మధ్యలో ఆపేసి వచ్చినవారే అని తెలుసుకుంది. అప్పుడు సౌమ్యకి చాలా బాధేసింది. ఎలాగైనా తను బాగా చదువుకుని ఆడపిల్లకు చదువు ఎంత ముఖ్యమో నాన్నకి చెప్పాలనుకుంది.

ప్రైవేటుగా ఉన్నత చదువులు చదివింది. తనకిష్టమైన పోలీసు ఉద్యోగానికి శిక్షణ తీసుకుంది. అనుకున్నట్టుగానే మంచి మార్కులు సాధించి పోలీస్ ఉద్యోగాన్ని సంపాదించింది. పోలీసు డ్రెస్‌లో ఇంటికి వెళ్లిన సౌమ్యని చూసి అమ్మానాన్న చాలా సంతోషించారు. తన టోపీ తీసి సౌమ్య వాళ్ల నాన్న తలపై పెడుతూ, 'నాన్న ఆడపిల్లలకు చదువు చాలా అవసరం. ఆడపిల్లలు బాగా చదువుకుంటే ఎవరిపై ఆధారపడకుండా తమ కాళ్లపై తాము నిలబడతారు' అని చెప్పింది. అప్పుడు నాన్న కళ్ళలోంచి నీళు వచ్చాయి. అప్పటినుండి ఆ ఇంట్లో కొడుకులతో సమానంగా కూతురిని చూశారు.

- యం.రోషిణీ,
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రేగులపల్లి,
బెజ్జంకి మండలం, సిద్దిపేట.

నేను గీసిన బొమ్మ

మదీయ, 7వ తరగతి,
జడ్పీ స్కూల్ రాంపూర్, నిజాంపేట, మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి.
ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కింగ్స్ విన్స్

- గుజరాత్‌పై 11 పరుగుల తేడాతో పంజాబ్ గెలుపు
- శ్రేయస్, శశాంక్ మెరుపులు

శ్రేయస్ (97నాటౌట్)

అహ్మదాబాద్: ఐపిఎల్ సీజన్–18లో పంజాబ్ కింగ్స్ బోణీ కొట్టింది. నరేంద్ర మోడీ స్టేడియంలో చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టు 11 పరుగుల తేడాతో గెలిచింది. పంజాబ్ నిర్దేశించిన 244పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో గుజరాత్ జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసే సరికి 5వికెట్లు కోల్పోయి 232 పరుగులే చేయగల్గింది. ఓపెనర్ సాయి సుదర్శన్(74), బట్లర్(54), రూథర్ఫోర్డ్(46) మెరుపు ఇన్నింగ్స్ ఆడిన గుజరాత్‌ను గెలిపించలేకపోయింది. పంజాబ్ బౌలర్లు అర్షదీప్‌కు రెండు, జాన్సెన్, మ్యాక్స్‌వెల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అంతకుముందు తొలుత బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్ జట్టు గుజరాత్ టైటాన్స్‌పై భారీస్కోర్‌ను నమోదు చేసింది. టాస్ గెలిచిన గుజరాత్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దాంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 243 పరుగులు చేసింది. పంజాబ్ కొత్త కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(97నాటౌట్; 42బంతుల్లో 5ఫోర్లు, 9సిక్సర్లు) అజేయంగా నిలిచాడు. చివరి ఓవర్లో శశాంక్ సింగ్(44నాటౌట్; 14బంతుల్లో 6ఫోర్లు, 2సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. పవర్ గేమ్‌కు ప్రాధాన్యత ఇచ్చిన అయ్యర్ ఆ తర్వాత చెలరేగాడు. మరో ఎండ్‌లో శశాంక్ సింగ్ సుడిగాలి ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ వేసిన మహ్మద్ సిరాజ్ బౌలింగ్‌లో శశాంక్ సింగ్ ఏకంగా 5ఫోర్లు బాదాడు. ఆరంభంలో ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(47; 23బంతుల్లో 7ఫోర్లు, 2సిక్సర్లు), అజ్మతుల్లా ఒమర్జాయ్ 16, మార్కస్ స్టొయినిస్ 20 పరుగులు చేశారు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో సాయి కిశోర్‌కు మూడు, రబడా, రషీద్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ శ్రేయస్ అయ్యర్‌కు దక్కింది.

స్కోర్‌బోర్డు...

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ ఆర్యా (సి)సాయి సుదర్శన్ (బి)రషీద్ ఖాన్ 47, ప్రభ్‌సిమ్రన్ (సి)అర్షాద్ ఖాన్ (బి)రబడా 5, శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 97, అజ్మతుల్లా (సి)అర్షాద్ ఖాన్ (బి)సాయి కిషోర్ 16, మ్యాక్స్‌వెల్ (ఎల్‌బి)సాయి కిషోర్ 0, స్టొయినీస్ (సి)అర్షాద్ ఖాన్ (బి)సాయి కిషోర్ 20, శశాంక్ సింగ్ (నాటౌట్) 44, అదనం 14. (20ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 243పరుగులు. **బౌలింగ్:** సిరాజ్ 4–0–54–0, రబడా 4–0–41–1, అర్షాద్ 1–0–21–0, రషీద్ 4–0–48–1, ప్రసిధ్ 3–0–31–0, సాయి కిషోర్ 4–0–30–3.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి)శశాంక్ సింగ్ (బి)అర్షదీప్ 74, గిల్ (సి)ప్రియాన్ష్ ఆర్యా (బి)మ్యాక్స్‌వెల్ 33, బట్లర్ (బి)జాన్సెన్ 54, రూథర్ఫోర్డ్ (బి)అర్షదీప్ 46, తెవాటియా (రనౌట్) అర్షదీప్ 6, షారుక్ ఖాన్ (నాటౌట్) 6, అర్షదీప్ (నాటౌట్) 1, అదనం 12. (20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 232పరుగులు. **బౌలింగ్:** అర్షదీప్ 4–0–36–2, అజ్మతుల్లా 2–0–29–0, జాన్సెన్ 4–0–44–1, మ్యాక్స్‌వెల్ 2–0–26–1, స్టొయినీస్ 2–0–31–0, చాహల్ 3–0–34–0, వ్యాషక్ 3–0–28–0

ఐపిఎల్‌లో నేడు	రాజస్తాన్ రాయల్స్ × కోల్‌కతా నైట్‌రైడర్స్ వేదిక: గౌహతి; రాత్రి 7.30గం॥లకు

वित्त मंत्रालय MINISTRY OF FINANCE

జిఎస్టీ వడ్డీ మాఫీ & జరిమానా పథకం

సిజిఎస్టీ చట్టంలోని సెక్షన్ 128ఏ కింద ప్రవేశపెట్టబడింది

2017-18, 2018-19 మరియు 2019-20 ఆర్థిక సంవత్సరానికి సెక్షన్ 73 కింద లేవనెత్తిన డిమాండ్లకు సంబంధించి వడ్డీ లేదా జరిమానా లేదా రెండింటినీ షరతులతో కూడిన మాఫీని అందించడానికి సిజిఎస్టీ చట్టంలో సెక్షన్ 128ఏ ని చేర్చడం.

జిఎస్టీ అమలు ప్రారంభ సంవత్సరాల్లో పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొన్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని, సిజిఎస్టీ చట్టంలో చేసిన సవరణలు:

- 2017-18, 2018-19 మరియు 2019-20 ఆర్థిక సంవత్సరాలకు సిజీఎస్టీ చట్టంలోని సెక్షన్ 73 కింద జారీచేయబడిన డిమాండ్ నోటీసులకు వడ్డీ మరియు జరిమానాలను మాఫీ చేయడానికి.

TAX

పన్ను చెల్లింపుదారుడు **31.03.2025** వరకు నోటీసులో డిమాండ్ చేసిన పూర్తి పన్ను మొత్తాన్ని చెల్లించే సందర్భాలలో

సంబంధిత ఫారమ్‌లను జూన్ 30, 2025 లోపు సమర్పించాలి

ఈ కాలక్రమం వ్యాపారాలకు పథకాన్ని పాటించడానికి తగినంత సమయాన్ని అందిస్తుంది, అదే సమయంలో భారీవడ్డీ & జరిమానా లేకుండా జిఎస్టీ సమ్మతిని క్రమబద్ధీకరించడానికి వారిని ప్రోత్సహిస్తుంది.

జిఎస్టీ వడ్డీ మినహాయింపు & జరిమానా పథకంతో మీ సమ్మతి ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది!

మరిన్ని వివరాల కోసం, దయచేసి సిజిఎస్టీ చట్టం, 2017లోని సెక్షన్ 128ఏ, నోటిఫికేషన్ నెంబరు.20/2024–కేంద్ర పన్ను తేదీ08.10.2024 మరియు సర్క్యులర్ నెంబరు. 238/32/2024–జిఎస్టీ తేదీ.15.10.2024 చూడండి.

క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

CBC 15502/13/0012/2425

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ మరియు కస్టమ్స్

@cbicindia @cbic_india @cbicindia @CBICINDIA CBIC India

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68